జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 265 విశాఖపట్నం | బుధవారం 24 మే 2023 | 8 పేజీలు | వెల : 5.00







## నేడు కొవ్వూరులో జగన్ పర్యటన..



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నేడు సీఎం వైఎస్ జగన్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో జగన్ నగదు జమచేయనున్నారు. ఈ మేరకు సీఎంఓ షెడ్యూల్ విడుదల చేసింది. రేపు ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కొవ్వూరు చేరుకుంటారు. అక్కడ సత్యవతి నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీఎం జగన్ కొవ్వూరు నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# కృష్ణా జలాలకు కర్నాటక ఎసరు..!

అమరావతి, : కృష్ణా జలాలను తరలించేందుకు తుంగభద్ర డ్యాంకు ఎగువన "నవలి" రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు కర్ణాటక సిద్ధమవుతోంది. తుంగభద్రలో భాగస్వామ్య రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణలు ఈ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తుండగా కర్ణాటక మాత్రం అనుమతుల కోసం డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేది)ను తుంగభద్ర బోర్డు ముందుంచింది. ఇటీవల తుంగభద్ర బోర్డు చైర్మన్ రాయ్ పురే అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలోనూ, గత ఏడాది బెంగళూరు భేటీ-లోనూ ఏపీ అధికారులు తమ వాదనను బలంగా వినిపించారు. కర్ణాటక మాత్రం తుంగభద్ర పూడిక వల్ల కోల్పోతున్న నీటిని వినియోగించుకునేందుకు కొప్పళ జిల్లా నవలి వద్ద 52 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టే రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులివ్వాలనీ, దీని వల్ల తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని చెబుతోంది. 230 టీ-ఎంసీల తుంగభద్ర జలాల్లో బచావత్ -ట్రైబ్యునల్ ద్వారా తమ వాటాగా దక్కిన 151.49 టీ-ఎంసీలను సద్వినియోగం చేసుకునేందుకు రిజర్వాయర్ నిర్మిస్తున్నట్టు- కర్ణాటక చెబుతోంది. తుంగభద్రలో పూడిక వల్ల నీరు వృథా అవుతోందనీ, కేటాయింపుల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోలేక పోతున్నామని ఆ రాష్ట్ర నీటిపారుదల ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ వాదనను ఎప్పటి నుంచో తోసిపుచ్చుతున్న ఏపీ తుంగభద్ర బోర్డుకు విస్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించింది. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే తుంగభద్రకు ఎగువన తుంగ, భద్ర డ్యామ్, సింగటలూరు బ్యారేజ్, సింగటలూరు ఎత్తిపోతల పథకాలను నిర్మించి కేటాయింపుల కన్నా అధికంగానే నీటిని తరలిస్తోంది.. ఇపుడు కొత్తగా నవలి రిజర్వాయర్ నిర్మిస్తే కృష్ణా దిగువన ఉన్న తమ రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలు దెబ్బతింటాయి.. తుంగభద్ర డ్యాంలో నీటి సామర్థ్యంపై 2008లో చేసిన టోపోగ్రాఫిక్ సర్వేకూ, 2016లో చేసిన సర్వేకు నాలుగు టీ-ఎంసీల తేడా వచ్చింది..తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక భారీగానే నీటిని తరలిస్తున్నట్టు- ఆధారాలు కనబడుతున్నాయి.. ఈ నేపథ్యంలో తుంగభద్ర సామర్థ్యం, కేటాయింపులు, వినియోగంపై సాంకేతికంగా నిర్దిష్టమైన గణాంకాలను వెల్లడించాలని బోర్డును ఏపీ కోరుతోంది. 133 టీ-ఎంసీల సామర్థ్యంతో 1953లో నిర్మించిన తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత 105.78 టీ-ఎంసీలకు తగ్గుముఖం పట్టినట్టు- టోపోగ్రాఫిక్ సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఎగువ నుంచి వచ్చే వరద జలాలను కూడా కలుపుకుని డ్యాంలో 75శాతం నీటి లభ్యత ఆధారంగా 230 టీ-ఎంసీలు అందుబాటు-లోకి వస్తాయని బావించి తుంగభద్ర బోర్డు మూడు రాష్ట్రాలకు కేటాయింపులు చేసింది. కర్ణాటకకు 151.49, ఏపీకి 72, తెలంగాణకు 6.51 టీఎంసీలను కేటాయించింది. పూడిక వల్ల కోల్పోతున్న నీటిని మినహాయించి అందుబాటు-లో ఉన్న జలాలను దామాషా ప్రకారం ప్రతి ఏడాది తుంగభద్ర బోర్డు మూడు రాష్ట్రాలకు కేటాయిస్తోంది. కేటాయింపులను పట్టించుకోకుండా ఎగువ ప్రాజెక్టుల ద్వారా కర్ణాటక నీటిని తోడేస్తుంది. ఈ నేపథ్యంలో తుంగభద్రలో నీటి లెక్కలను తేల్చాకే నవలి రిజర్వాయర్ గురించి సమగ్రంగా చర్చించాలన్న ఏపీ వాదనకు తుంగభద్ర బోర్డు కూడా సానుకూలత వ్యక్తం చేసింది.




# ఆర్-5 జోన్ లే-అవుట్లకు తుదిరూపు..

## కొత్త వెంచర్ పనుల్లో స్పీడ్

అమరావతి, : అమరావతి ఆర్-5 జోన్‌లో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పంపిణీ చేయనున్న లేఅవుట్లు తుదిరూపు సంతరించుకుం టున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో సోమవారం నుంచి పనులు మరింత ముమ్మరం చేశారు. రెవెన్యూ, పురపాలకశాఖ, సీఆర్ డీఏ అధికారులు సమన్వయంతో పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆఘమేఘాలపై ఉరకలు, పరుగులు తీస్తున్నారు.. గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల ధాటికి ధ్వంసమైన



లేఅవుట్లను పునరుద్ధరిస్తున్నారు.. ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల్లో 50 వేల మంది కి పైగా పేదలకు నిర్దేశించిన ఈ ప్లాట్లను 1402.58 ఎకరాల విస్తీర్ణంలో 25 లేఅవుట్లను అభివృద్ధి చేశారు. మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తిచేస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలి పారు. ఇందులో కొత్తగా భూ సేకరణ జరిపిన 268 ఎకరాల భూములు కూడా ఉన్నాయి. ఈనెల 26వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.. ఇప్పటి వరకు సేకరించిన భూమికి జంగిల్ క్లియరెన్స్ పూర్తయిందని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. అన్ని లేఅవుట్లలో మెరకవేసి హద్దురాళ్లతో పాటు మార్కింగ్ నిర్వహిస్తున్నారు. అంతర్గత రవాణా కోసం 76.28 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు 751.93 ఎకరాల్లో 14 లేఅవుట్లు, గుంటూరు జిల్లా పేదల కోసం 650.65 ఎకరాల్లో 11 లేఅవుట్లు సిద్ధం చేశారు. మార్కింగ్, నెంబరింగ్ ప్రక్రియను సీఆర్ డీఏ కమిషనర్ పరిశీలించారు. అన్ని లేఅవుట్లకు అవసరమైన 67,700 హద్దురాళ్ల ఏర్పాటు పనులు కూడా పూర్తికావచ్చాయి..

## ఢిల్లీ ముఖ్యమంత్రికి మరోసారి నోటీసులు జారీ చేసిన అహ్మదాబాద్ కోర్టు

ఢిల్లీ :ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌కు అహ్మదాబాద్ కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. జూన్ 7న ఇద్దరు నేతలు కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ అకడమిక్ డిగ్రీపై గుజరాత్ యూనివర్సిటీ దాఖలు చేసిన పరువు నష్టం కేసుపై కోర్టు తాజాగా సమన్లు జారీ చేసింది. ఇద్దరు నేతలను మంగళవారం కోర్టుకు హాజరుకావాలని గతంలో సమన్లు జారీ చేయగా.. నేతలెవరూ కోర్టుకు హాజరుకాలేదు. ఈ క్రమంలో సమన్లు అందినట్లుగా కనిపించడం లేదని కోర్టుకు తెలుపడంతో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కేజ్రీవాల్, సంజయ్ సింగ్‌లకు నోటీసులు జారీ చేసింది. అయితే, కేజ్రీవాల్, సింగ్‌లకు కోర్టు జారీ చేసిన సమన్లు ఇంకా అందలేదని ఆప్ గుజరాత్ లీగల్ సెల్ హెడ్ ప్రణవ్ ఠక్కర్ తెలిపారు. ప్రధాని మోదీ డిగ్రీ అర్హతను ప్రశ్నిస్తూ కేజ్రీవాల్, సంజయ్ సింగ్ గుజరాత్ యూనివర్సిటీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని, ఉద్దేశపూర్వకంగా గుజరాత్ యూనివర్సిటీ పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించారని వర్సిటీ రిజిస్ట్రార్ క్రిమినల్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు.






## బీజేపీకి ఒక్క ఓటు కూడా పడనీయొద్దు: మమతా బెనర్జి



కోల్‌కతా: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఒక్క ఓటు కూడా పడనీయవద్దని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతాబెనర్జి వ్యాఖ్యానించారు. ఇవాళ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ బృందం కోల్‌కతా వెళ్లి మమతాబెనర్జిని కలిసింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్‌తోపాటు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, ఎంపీ రాఘవ్ చద్దా తదితరులు ఉన్నారు. ఢిల్లీలో అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ తీర్పునకు విరుద్ధంగా ఆర్డినెన్స్ తీసుకురావడంపై కేజ్రీవాల్.. మమతాబెనర్జితో చర్చించారు. ఈ విషయంలో కేంద్రంపై ఢిల్లీ సర్కారు చేసే పోరాటినికి మద్దతు నిలువాలని కోరారు. ఈ భేటీ సందర్భంగా మమతాబెనర్జి మాట్లాడుతూ.. బీజేపీపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో గవర్నర్‌లు, ఆర్డినెన్స్‌లు, లెటర్‌ల ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలను పరిపాలించేలా ఉందని మమతాబెనర్జి ఎద్దేవా చేశారు. కలిసి పనిచేద్దామనే ఉద్దేశం ఉంటే బీజేపీయేతర పార్టీలన్నీ ఒక్క తాటిపైకి రావాలన్నారు. బీజేపీకి ఒక్క ఓటు కూడా పడనీయకుండా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఆర్డినెన్స్‌లు, గవర్నర్‌లతో రాష్ట్రాలపై పెత్తనం చేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా అందరూ బీజేపీయేతర పార్టీలకు ఓటు వేయాలని కోరుతున్నానని మమత చెప్పారు.



## సివిల్ సర్వీసెస్-2022 ఫలితాలు విడుదల..

### ఆలిండియా టాపర్‌గా ఇషితా కిషోర్

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ - 2022 ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా మొత్తం 933 మంది ఈ పరీక్షల ద్వారా వివిధ సర్వీసులకు ఎంపికయ్యారు. వారిలో ఇషితా కిషోర్ అనే యువతి ఆలిండియా టాపర్‌గా నిలిచారు. ఈసారి మొదటి నాలుగు ర్యాంకులను మహిళలే సొంతం చేసుకున్నారు. టాపర్‌గా ఇషిత నిలువగా.. గరిమా లోహియా, ఉమా హారతి ఎన్, స్మృతిమిశ్రావరుసగారెండు, మూడు, నాలుగుర్యాంకుల్లో ఉన్నారు.

# రెండు లక్షల కోట్ల రెండు వేల నోట్లు



ముంబై, మే 23, :రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖీఃఎ) తీసుకున్న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ నిర్ణయంతో, 2016 నాటి పెద్ద నోట్ల రద్దు సంఘటనలు తిరిగి కళ్లకు కట్టబోతున్నాయి. నోట్ల మార్పిడి, డిపాజిట్ల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభం చేసింది. కాబట్టి, బ్యాంక్‌ల వద్ద పొడవాటి లైన్లు కనిపించవచ్చు. 2016 నాటి రచ్చ పునరావృతం కావచ్చు.2023 మార్చి నాటికి, చెలామణిలో ఉన్న నోట్లలో రూ. 2,000 నోట్ల వాటా 10.8%, వాటి మొత్తం విలువ రూ. 3.62 లక్షల కోట్లు. 2018 మార్చిలో గరిష్టంగా రూ. 6.73 లక్షల కోట్ల విలువైన రూ. 2000 నోట్ల చలామణీలో ఉన్నాయి.ఆర్బీఐ నిర్ణయంతో చాలావరకు రూ. 2,000 నోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల డిపాజిట్ బేస్ ఒ సిస్టమ్ లిక్విడిటీ మెరుగు పడుతుందని భావిస్తున్నారు. మొత్తంగా, బ్యాంక్ డిపాజిట్లు రూ. 1.5 లక్షల కోట్ల నుంచి రూ. 2 లక్షల కోట్ల వరకు పెరుగుతాయని అంచనా వేశారు.ఫైనల్‌గా, బ్యాంకుల్లో డిపాజిట్ బేస్ పెరగడం వల్ల బ్యాంకుల్లో క్రెడిట్–డిపాజిట్ నిష్పత్తి మెరుగుపడుతుంది. నికర వడ్డీ మార్జిన్‌లపై సానుకూల ప్రభావం పడుతుంది. ఈజ24 రెండో అర్ధభాగంలో బ్యాంక్ ఫలితాల్లో ఇది ప్రతిబింబిస్తుంది. బ్యాంక్ స్టాక్స్ పరుగులు పెట్టే అవకాశం ఉంది. రూ. 2,000 నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసే ప్రజలు, తమ అవసరాల కోసం ఆ డబ్బును చిన్న డినామినేషన్లలో తక్కువ కాలంలోనే వెనక్కు తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి, కొన్ని కొత్త డిపాజిట్లను తాత్కాలిక డిపాజిట్లుగా చూడాల్సి ఉంటుంది. రూ. 2000 నోట్లలో మరికొంత భాగం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి ప్రవేశించకపోవచ్చు. పెద్ద మొత్తంలో డబ్బు డిపాజిట్ చేసి ఆదాయ పన్ను శాఖ కంట్లో పడే బదులు అత్యధిక విలువైన వస్తువులు, బంగారం వంటివాటిని ప్రజలు కొనే అవకాశం ఉంది. లేదా రియల్ ఎస్టేట్‌పై ఖర్చు చేయవచ్చు. దీనివల్ల, వివిధ రంగాల్లో కూడా అమ్మకాలు, ఆయా కంపెనీల ఆదాయం అనూహ్యంగా పెరగవచ్చు. చెలామణిలో ఉన్న రూ. 3.62 లక్షల కోట్ల విలువైన రూ. 2,000 నోట్లలో, కేవలం 15–30% మాత్రమే మన్నికైన/దీర్ఘకాలిక డిపాజిట్లుగా బ్యాంకుల్లోకి చేరతాయన్నది అంచనా. ఈ ప్రకారం, రూ. 50,000 కోట్ల నుంచి రూ. 90,000 కోట్ల వరకు విలువైన పింక్ నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరతాయని ఊహిస్తున్నారు. 2016 నవంబర్‌లోని పరిస్థితి వేరు, ఇప్పటి పరిస్థితి వేరు. అప్పుడు పెద్ద నోట్లను రద్దు చేశారు, ఇప్పుడు ఉపసంహరించుకుంటున్నారు. అప్పుడు కరెన్సీ చెల్లుబాటు కాకుండా పోయింది, ఇప్పుడు రూ. 2,000 నోట్లు చట్టబద్ధమైన టెండర్‌గానే కొనసాగుతాయి. బ్యాంకుల్లో నోట్ల మార్పిడి, డిపాజిట్ల కోసం ప్రజలకు సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఉంది.

# ఏడాదిలో 57 శాతం పెరిగిన లాభాలు

ముంబై, మే 23,:గత ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు అద్భుతం చేశాయి. మన దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల మొత్తం లాభం లక్ష కోట్ల రూపాయల మార్కును అధిగమించింది. ఈ ఫీట్ సాధించడం ఇదే తొలిసారి. మన దేశంలో మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. 2017–18లో రూ. 85,390 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసిన పీఎస్బీలు, క్రమంగా పుంజుకుని 2022–23లో రూ. 1,04,649 కోట్ల లాభానికి చేరుకున్నాయి. 2021–22లో ఆర్జించిన సంచిత లాభం రూ. 66,539.98 కోట్ల లాభంతో పోలిస్తే, 2022–23లో ఏకంగా 57 శాతం పెరిగింది.లక్ష కోట్ల రూపాయల లాభం ఘనతలో సగం వాటా మార్కెట్ లీడర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాది (ఎస్బీఐ ). ఆ ఆర్థిక సంవత్సరంలో, ఎస్బీఐ, రూ. 50,232 కోట్ల వార్షిక లాభాన్ని నివేదించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం కంటే 59 శాతం వృద్ధిని సాధించింది.శాతం పరంగా చూస్తే, నికర లాభంలో 126% వృద్ధితో రూ. 2,602 కోట్లను సాధించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తొలిస్థానంలో ఉంది. 100% పెరుగుదలతో రూ. 1,862 కోట్ల లాభానికి చేసిన యూకో బ్యాంక్ రెండో స్థానంలో, 94% వృద్ధితో రూ. 14,110 కోట్ల లాభం సాధించిన బ్యాంక్ ఆఫ్ బరోడా మూడో స్థానంలో ఉన్నాయి.పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) మినహా, మిగిలిన పీఎస్బీలన్నీ ఆకర్షణీయమైన లాభాన్ని ఆర్జించాయి. దిల్లీ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న పీఎన్బీ వార్షిక నికర లాభం 2021–22లో రూ. 3,457 కోట్లుగా ఉండగా, 2022–23లో 27% శాతం క్షీణించి రూ. 2,507 కోట్లకు పరిమితమైంది.ఎస్బీఐ కాకుండా, రూ.10,000 కోట్ల కంటే ఎక్కువ వార్షిక లాభాన్ని నివేదించిన ఇతర పీఎస్బీలు.. బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ. 14,110 కోట్లు), కెనరా బ్యాంక్ (రూ. 10,604 కోట్లు).పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ వార్షిక లాభం 26 శాతం (రూ. 1,313 కోట్లు), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 51 శాతం (రూ. 1,582 కోట్లు), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 23 శాతం (రూ. 2,099 కోట్లు), బ్యాంక్ ఆఫ్ ఇండియా 18 శాతం (రూ. 4,023 కోట్లు), ఇండియన్ బ్యాంక్ 34 శాతం (రూ. 5,282 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 61 శాతం (రూ. 8,433 కోట్లు) లాభాలను సాధించాయి2023 మార్చి త్రైమాసికం/2022–23 నాలుగో త్రైమాసికంలో, 12 పీఎస్బీల సంచిత లాభం 95% పైగా పెరిగి రూ. 34,483 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ. 17,666 కోట్లుగా ఉంది.అధిక వడ్డీ ఆదాయం, నిరర్థక ఆస్తుల నిర్వహణలో మెరుగుదల, మొండి బకాయిలు తగ్గడం, పీఎస్బీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి మూలధనం, ఆర్బీఐ చేపట్టిన సంస్కరణలే ఈ స్థాయి లాభాలకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

# అనంత ఉదయ భాస్కర్ చేపట్టిన బహిరంగ సభకు అనుమతి నిరాకరించాలి

**రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) డిమాండ్**



రంపచోడవరం, ప్రజాపాలన ప్రతినిధి :– డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఇంటీరియం బెయిల్ పై ఉన్న అనంత ఉదయ భాస్కర్ జరపబోయే బహిరంగ సభకు అనుమతి నిరాకరించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) డిమాండ్ చేసింది.మంగళవారం ఉదయం రంపచోడవరం ఏ ఎస్ పి జగదీష్ అడహళ్లి ని ఆర్పిఐ బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ,గత సంవత్సరం మే 19వ తేదీన అనంత ఉదయ భాస్కర్ తన దగ్గర డ్రైవర్గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని అత్యంత కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసినారని అన్నారు. మే 23 వ తేదీన పోలీసుల వద్ద తనే వీధి సుబ్రహ్మణ్యం అని హత్య చేశానని ఒప్పుకున్నాడు అన్నారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో 206 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్నాడన్నారు. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అయినప్పటికీ గడపగడపకు పార్టీ కార్యక్రమంలో ఆయన ఫ్లెక్సీలతో ప్రచారం చేయడం పాలాభిషేకాలు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వము ప్రభుత్వ పెద్దలు అండదండలు లేకపోతే రంపచోడవరం నుండి దేవీపట్నం వెళ్లే మెయిన్ రోడ్ ని బ్లాక్ చేసి బహిరంగ సభకు అనుమతి ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. బహిరంగ సభకు అనుమతించిన ప్రదేశంలోనే సబ్ కలెక్టర్ ఆఫీస్ ఆసుపత్రి ఉన్నాయని రోగులకు ప్రజలకు ఇబ్బందికరమైన రహదారిపై సభకు అనుమతించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి జిల్లా కోర్టు, అమరావతి హైకోర్టులో బెయిల్ తిరస్కరించగా, ఢిల్లీ సుప్రీంకోర్టు నుండి మధ్యంతర బెయిల్ పై ఉన్న ముద్దాయి అనంత ఉదయభాస్కర్ చేపట్టిన బహిరంగ సభను దళిత గిరిజన ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ ను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిల్ల శ్రీనివాసరావు, చిందాడ అర్జున్, జనిపెల్ల ఏడుకొండలు ఉన్నారు.

# దేవుని సాక్షిగా నిజమైన రైతులకు అన్యాయం



నూజివీడు, మే 23, ప్రజాపాలన ప్రతినిధి: ప్రాణికోటిలో ఎవరికైనా అన్యాయం జరిగితే... దేవుడికి మొరపెట్టుకుంటారు. ఆ దేవుడి సాక్షిగానే... అన్యాయం జరిగితే... ఇక ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక... దీనంగా మిగిలిపోతున్న సన్న, చిన్న కారు రైతాంగం దుస్థితి వర్ణనాతీతం. ఈ సంఘటనకు నిలువెత్తు నిదర్శనంగా ఏలూరు జిల్లా పరిధిలోని నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గొల్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రఘునాథ స్వామివారి ఆలయానికి చెందిన 3,356 ఎకరాల భూములలో రైతాంగం సాగు చేస్తున్నారు. దశాబ్దాల తరబడి సన్నా, చిన్న కారు రైతాంగం అర ఎకరం నుండి 2.50 ఎకరాల వరకు పంటలు పండించుకుని వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్నారు. కాలక్రమమైన ఎండోమెంట్ భూములపై రాజకీయ నాయకుల కన్ను పడటంతో సుదూర ప్రాంతాల నుండి గొల్లపల్లి శ్రీ రఘునాథ స్వామి వారికి చెందిన వేంపాడు అగ్రహారం భూములు లీజుల పేరిట అక్రమ విక్రయాలు, ఆక్రమణలు కొనసాగించారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు కోర్టులను ఆశ్రయించారు. రైతుల బాధ, భూముల కథ తెలుసుకున్న సుప్రీం కోర్ట్ 1990 వ సంవత్సరంలో తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రైతుల అభీష్టం మేరకు భరణం కట్టించుకోవాలని సూచించడం జరిగింది. ఈ వాక్యాన్ని కొందరు స్వార్ధపర అధికారులు, వెనుక నుండి నడిపే రాజకీయ నేతల ప్రోద్బలంతో రైతులందరికీ తారక మంత్రంలా ఒకే విధంగా ఆదేశించడం జరిగింది. ప్రతి రైతు ఎకరాకు బస్తా వేరుసెనగ కాయల ధరలు భరణంగా ఆలయానికి చెల్లించాలని ఆదేశించారు. ఈ ఆదేశం సుప్రీంకోర్టు తీర్పుకు పూర్తిగా విరుద్ధమయిందనే వాదనతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ సన్నా, చిన్న కారు రైతుల పక్షాన పోరాటానికి రంగ ప్రవేశం చేశారు. ఆలయానికి భరణం కట్టాలని రైతులందరికీ సుప్రీంకోర్టు తీర్పు చెప్పలేదని నరసింహ వాదిస్తున్నారు. కేవలం 1600 ఎకరాలలో ఉన్న 207 మంది మాత్రమే కట్టాలని స్పష్టమైన తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 1152 మంది రైతులు ఐచికంగా ఆలయ నిర్వహణ ఖర్చులు చెల్లించాలని సుప్రీంకోర్టు సూచించినట్లు వివరించారు. ఇంత చక్కగా వివరిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే, కోర్టు తీర్పుకు వక్ర భాష్యం చెబుతూ లాభాపేక్షతో స్వార్ధపూరితంగా అధికారులు వ్యవహరించటం దారుణం అన్నారు. అధికారులు, రాజకీయ నేతల కుట్రలో భాగంగా వాస్తవ సాగులో ఉన్న సన్న చిన్న కారు రైతులను తరిమికొట్టేందుకు ఈనెల 25,26,27 తేదీలలో వేదికను ఖరారు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. శ్రీ రఘునాథ స్వామిని అడ్డుపెట్టుకొని నీతి బాహ్యంగా, చట్ట విరుద్ధంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. బక్క చిక్కిన సన్న, చిన్న కారు రైతాంగాన్ని తరిమికొట్టేందుకు పోలీసు బలగాలను సమాయత్తం చేయడం కంటే ఘోరమైన ఘటన మరొకటి ఉండదన్నారు. స్థానిక సన్న, చిన్న కారు రైతాంగానికి అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. రైతులందరినీ సంఘటితం చేసి నిజమైన రైతులతో పోరాటం చేస్తామన్నారు. సాగులో ఉన్న సన్న, చిన్న కారు రైతులకు భూములను దక్కించుకుంటామని అన్నారు.

# జాతీయస్థాయి క్రీడలు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించడం అభినందనీయం




పర్చూరు, మే 23, ప్రజాపాలన : జాతీయస్థాయి క్రీడలను మౌలిక వసతులు లేని గ్రామీణ ప్రాంతాల్లో, అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ, నిర్వహించడం అభినందనీయమని, మొక్కవోని దీక్షతో తెదేపా బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ప్రత్యేక శ్రద్ధతో, దిగ్విజయంగా నిర్వహించడం ప్రశంసనీయమని, క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరమని, తెదేపా బాపట్ల అసెంబ్లీ నియో జకవర్గ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ , తెదేపా రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు సలగల రాజశేఖర్ బాబులు కొనియాడారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో, ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా, ఏలూరి యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ కేంద్రం పర్చూరులోని వై జంక్షన్ వద్ద ఉన్న స్టేడియంలో, ఆల్ ఇండియా స్థాయి పోటీల ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో చిక్కోల్ చీతాస్ వైజాగ్, శౌర్య క్లబ్ ఉత్తరప్రదేశ్ తలపడగా, విజయం శౌర్య క్లబ్ ఉత్తరప్రదేశ్ ని వరించింది. ఈ సంద ర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో, ముఖ్య అతిథి నరేంద్ర వర్మ మాట్లాడారు. గత 15 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా సమాజసేవే లక్ష్యంగా, ఎమ్మెల్యే ఏలూరి పనిచేస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత యువతలో ఆత్మస్థైర్యాన్ని, మనోవికాసాన్ని, దేహదా రు ఢ్యాన్ని పెంపొందిస్తాయనే లక్ష్యంగా, ఎమ్మెల్యే ఏలూరి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.గ్రామీణ స్థాయి క్రీడాకారులకు, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేలా, జాతీయస్థాయి పోటీలు నిర్వహించి, మనోధైర్యాన్ని పెంపొందించారన్నారు. ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వేలాది మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారని కొనియాడారు. తొలుత నరేంద్ర వర్మ, సలగల రాజశేఖర్ లకు తెలుగుదేశం పార్టీ నాయకు లు, కార్యకర్తలు, క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బొమ్మల సెంటర్లోని ఎన్టీఆర్,అంబేద్కర్ విగ్రహాలకు, పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. స్టేడియం వద్ద మొదటి బహుమతి దాత విక్రమ్ వెంకటరావు కు క్రీడాకారులు నాయకులు స్వాగతం పలికారు. అనంతరం నరేంద్ర వర్మ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ మండల అధ్యక్షులు షేక్ శంషుద్దీన్, నల్లపునేని రంగ య్య చౌదరి, నాయుడు హను మంతరావు, పొద వీరయ్య, తాటి నాగేశ్వరరావు, తిరుమల శెట్టి శ్రీహరి, పర్చూరు టౌన్ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణ, ఇంకొల్లు టౌన్ అధ్యక్షుడు వల్లూరు మార్కు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి దేవతోటి సుంద ర రావు, పాలేరు రామకృష్ణ, మనం హరిబాబు, కాపు రవిచంద్ర, కోడూరు శేషా బ్రహ్మచారి, కొరటాల సురేష్, బొల్లాపల్లి సిద్దు, శానంపూడి చైతన్య, ధూళిపాళ్ల వెంకట స్వామి, కారుమంచి కృష్ణ, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇళ్ల పట్టాల పంపిణీ: రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజా పాలన ప్రతినిధి: పేదలకు అమరావతిలో ఈనెల 26న పండగ వాతావరణంలో జరగనున్న పట్టాల పంపిణీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. గాంధీనగర్ జింఖానా ప్రాంగణంలోని 192వ వార్డు సచివాలయంలో స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. నగరంలో సొంత ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్న లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తున్న నేపథ్యంలో.. అర్హులైన ఏ ఒక్కరూ మిగిలిపోకుండా చూడవలసిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని మల్లాది విష్ణు అన్నారు. సీఆర్డీఏ పరిధిలో నియోజకవర్గం నుంచి 7,211 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు కాగా.. వీరందరికీ ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు బ్రేక్ ఫాస్ట్, స్నాక్స్, త్రాగునీరుతో పాటు.. సభ వద్ద మొబైల్ టాయిలెట్లు సహా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కనుక ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో సెంట్రల్ ఎమ్మార్వో శ్రీనివాస్ వెన్నెల, సీడీఓ జగదీశ్వరి, వీఆర్వోలు, నాయకులు బంకా భాస్కర్, కాలే పుల్లారావు, పోలగాని వీరయ్య, పులపా కృష్ణ, ఆర్కే, పప్పుల శివ, పఠాన్ భూపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ సంతకం ఫోర్జరీ...

కర్నూలు, మే 23, :నంద్యాల జిల్లాలో భూబకాసురుల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. తాజాగా జిల్లా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేసి భూమిని కాజేసేందుకు పన్నాగం పన్నారు. మహానంది మండలం యు.బొల్లవరం గ్రామంలోని సర్వే నంబర్ –486 లో వక్ఫ్ బోర్డుకు సంబంధించి 2.86 ఎకరాల భూమి ఉంది. దాదాపు రూ. 80 లక్షల వరకు విలువ ఉండే ఈ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించారు. సదరు భూమిని వక్ఫ్ బోర్డు పరిధి నుండి తొలగించినట్లు పత్రాలు తయారు చేసి వాటిపై జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఫోర్జరీ సంతకంతో ఉత్తర్వులు తయారు చేశారు. ఆ భూమిని అందులో పట్టా భూమిగా చూపించారు. అయితే ఫోర్జరీ సంతకాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన సంతకం ఫోర్జరీ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు కలెక్టర్. సంబంధిత వ్యక్తులపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మహానంది తహశీల్దారు జనార్దన్ శెట్టి ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు ఎవరనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. 'వక్ఫ్ బోర్డు భూమిని ప్రొహిబిటరీ ప్రాపర్టీస్ నుండి కలెక్టర్ తొలగించినట్లు ఫోర్జరీ ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయమని ఆదేశించారు. ఫోర్జరీ ఉత్తర్వుల కాపీతో పోలీసులు ఫిర్యాదు చేశాం. ఈ కేసుపై రెవెన్యూ, పోలీసుల విచారణ సాగుతోంది. దర్యాప్తు అనంతరం నిందితులు ఎవరో తెలుస్తుంది' అని మహానంది తహశీల్దార్ జనార్ధన్ శెట్టి తెలిపారు'వక్ఫ్ బోర్డు భూమిని కన్వర్షన్ చేయమని ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి సంబంధిత ఉత్తర్వులతో ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఉత్తర్వులు తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నాం. త్వరలోనే ఫోర్జరీ ఉత్తర్వులు తయారు చేసిన సూత్రధారులను, పాత్రధారులను పట్టుకుంటాం' అని మహానంది ఎస్సై నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.తిరుపతి జిల్లాలోని కొత్త శానంబట్లలో ఉన్నట్లుండి గడ్డివాములకు నిప్పంటుకోవడం, ఇళ్లలో బట్టలు తగలబడిపోవడం, ఒకానొక సమయంలో తాళం వేసిన ఇంట్లలోని బీరువాలకు మంటలు అంటుకోవడం సంచలనంగా మరింది. విరూపాక్ష సినిమా రిలీజ్ కావడం అలాంటి సీన్లే ఇక్కడ కనిపించడంతో అంతా కంగారు పడ్డారు. ఊరికేదో అరిష్టం జరిగిందని భయపడిపోయారు. వరుసగా జరుగుతున్న ఘటనలపై పోలీసులు ఫోకస్ పెట్టారు. అసలు కొత్త శానంబట్లలో ఏం జరుగుతుందోనని స్పెషల్ టీం ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందం చేసిన దర్యాప్తులో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలను ఏఎస్పీ వెంకట రావు తెలిపారుఈ ఘటనలకు కొత్త శానంబట్ల గ్రామానికి చెందిన ఓ 19 ఏళ్ల అమ్మాయే కారణమని షాక్ ఇచ్చారు. పిల్లపాలెం కీర్తిగా గుర్తించినట్లు వెల్లడించారు. తల్లి ప్రవర్తన నచ్చకపోవడమే ఇందుకు ప్రధాన కారణం అని చెప్పారు. తల్లి ప్రవర్తనను మార్చేందుకు ఇలాంటి పనులు చేసిందని.. వారి బంధువుల ఇళ్లలో అగ్గి పుల్లలు గీసి పడేస్తూ.. ఘటనలకు పాల్పడినట్లు తెలిపారు. ముందుగా గడ్డివాము కాల్చి వేసిందని.. ఈ అగ్ని ప్రమాదాల్లో ఎలాంటి రసాయనాన్ని వినియోగించలేదని తెలిపారు. ఇందులో ఎలాంటి తాంత్రిక శక్తిని వినియోగించలేదని స్పష్టం చేశారు. మూఢనమ్మకాలను నమ్మకండని ప్రజలకు సూచించారు. తన ఇంట్లోనే యువతి మూడు సార్లు నిప్పు పెట్టిందని చెప్పారు.

## శాంతిప్రియను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గోకవరం ప్రజా పాలన మే 23: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు,రిపోర్టర్ పిట్ట అరుణ్, శ్రీమతి క్రాంతి కుమారి దంపతుల కుమార్తె శాంతి ప్రియ రజస్వల వీడుకకు హాజరై చిరంజీవి శాంతి ప్రియ ను దీవించి, ఆశీస్సులు అందించిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ. ఈ కార్యక్రమంలో గోకవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాలూరి బోసుబాబు,ఉంగరాల రాము,కన్నబాబు,అడపా భరత్,కోలా ఏసుబాబు, కోటా పెద్ద సూరిబాబు,ఈది అశోక్,రాయవరపు శ్రీనివాసరావు, పోసిన ప్రసాద్, గూండా శివప్రసాద్,చోడిశెట్టి గోపీనాథ్ గుప్త,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ సారథులు వాలంటీర్లే: జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు చంటిబాబు



గోకవరం, ప్రజా పాలన మే23 : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ సారథులు వాలంటీర్లేనని అని జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక ఎస్వీఆర్ పంక్షన్ హాల్లో మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 25 రకాల పథకాలకు వాలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారని చెప్పేందుకు గర్వపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగం కాకపోయినా కేవలం సేవ చేయాలనే తపనతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని చంటిబాబు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సత్కరించారు. ప్రభుత్వ పెన్షన్లను 64లక్షల మంది లబ్దిదారులకు అందిస్తున్న గొప్ప సేవకులు, సైనికులు వవాలంటీర్లను చంటిబాబు కొనియాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వాలంటీర్లు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇంతకుముందు ఎప్పుడూ కూడా జరగని విధంగా వైసీపీ ప్రభుత్వం చేసే ప్రతీ మంచి పనికి, ప్రతీ సంక్షేమ పథకానికి, ప్రతీ మేలుకు సారథులు, వారధులు, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఉన్న పరిస్థితిని వాలంటీర్ల ద్వారానే జరుగుతుందని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు. నిజాలు చెప్పగలిగే సత్య సాయుధులు వవాలంటీర్లని చంటిబాబు అన్నారు. ప్రతి ఇంటికి నేరుగా వెళ్లగలిగే వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రతి గడప వద్దకు తీసుకెళ్లగలిగినందున, ప్రతి ఇంట్లో మంచి జరిగిందో లేదో ధైర్యంగా అడిగే హక్కు వాలంటీర్లతోనే సాధ్యమైందన్నారు. వాలంటీర్ వ్యవస్థ ప్రతి గడపలో మంచి తప్ప చెడు ఎక్కడా చేయలేదని పేర్కొన్నారు. వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని స్వచ్ఛంద ససేవకులని చంటిబాబు కొనియాడారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి జరిగిన మంచి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం పి పి సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబు, సచివాలయం మండల కన్వీనర్ దాసరి రమేష్, వరసాల ప్రసాద్, పాటి రాంబాబు, కర్రి సూరారెడ్డి, గుల్లా ఏడుకొండలు, అక్షింతల రాజా, చింతల అనిల్ కుమార్, నరలశెట్టి నర్సయ్య, పెద్దాడ వెంకన్నదొర, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ అభివృద్ధికి డాక్టర్ అప్పారావు కృషి చిర స్మరణీయం



చీరాల, మే 23, ప్రజాపాలన : కాకినాడ జెఎన్‌టియు అభివృద్ధికి, వైస్ ఛాన్సలర్ గా డాక్టర్ అల్లం అప్పారావు చేసిన కృషి చిరస్మరణీయ మని, వ్యవస్థాపక వైస్‌ఛాన్సలర్ డాక్టర్ అల్లం అప్పారావు ఆక స్మిక మరణం బాధకలిగించిం దని, చీరాల సెయింట్ ఆన్స్ అటానమస్ ఇంజ నీరింగ్ కాలేజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ ఆవరణలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2008నుండి 2011వరకు వైస్‌ఛాన్సలర్‌గా యూనివర్శిటీ అభివృద్ధికి సేవలందించారని, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌విడి అనిల్‌కుమార్, పలువురు వక్తలు అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ అల్లం అప్పారావు, జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూని వర్సి టీ, (కె) కాకినాడకు, 2008 సంవత్సరం నుండి 2011 వరకు వైస్ ఛాన్సలర్ గా, యూనివర్సిటీ అభివృద్ధికి చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భ ముగా గుర్తు చేసుకున్నారు. 2008 నుండి 2011 సంవత్స రం వరకు, యూనివర్సిటీ అభివృద్ధి కొరకు ఎంతగానో పాటు పడ్డా రని, జె.యన్.టి.యు. కె.ను భారత దేశం లోని యూనివర్సిటీలలో, అగ్రశ్రేణి యూనివర్సిటీగా నిలి పేందుకు ఎంతో కృషిచేశారని, పలువురు వక్తలు అప్పారావు సేవలను వివరించారు.

# జిల్లా కలెక్టర్ రాజుపాలెం మండలంలో సుడిగాలి పర్యటన



రాజుపాలెం- ప్రజాపాలన ప్రతినిధి: వల్నాడు జిల్లా, రాజుపాలెం మండల పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రాథమిక వైద్య ఆరోగ్యశాఖ ఉపకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగా ముందురోజు ప్రజలకు వాలంటీర్ల ద్వారా సమాచారం పంపాల్సి ఉండగా, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, ఏఎన్ఎం, మహిళా పోలీస్ లు కలిసి సమావేశం నిర్వహించి ప్రణాళిక బద్ధంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోక పోవడంతో జిల్లా కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తాహశీల్దార్, ఎంపీడీవో, మండల వైద్యాధికారి లను ఆదేశించారు. అక్కడ నుంచి బయటకు వస్తున్న జిల్లా కలెక్టర్ ను ఆర్ అండ్ ఆర్ కాలనీవాసులు తాము తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఈ ప్రాంతంలో ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని విన్నవించగా, మంజూరు చేయిస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. పక్కనే ఉన్న అంగన్వాడి సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు.అంగన్వాడి లో ఉన్న చిన్నారులతో కొద్దిసేపు జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. అంగన్వాడి సెంటర్ లో 4 ఏళ్ల చిన్నారి తో మాట్లాడగా, ఆ చిన్నారి అసమాన ప్రతిభను కనబరిస్తూ జిల్లా కలెక్టర్ ప్రశ్నించిన అంశాలకు సమాధానం ఇచ్చారు.దేశంలో ఉన్న 29 రాష్ట్రాల రాజధానుల వివరాలను చిన్నారి జవాబు ఇవ్వడం, మరికొన్ని ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇవ్వడంతో ఆ చిన్నారి తెలివితేటలకు మంత్రముగ్ధులైన జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అంగన్వాడి సెంటర్ ను నిర్వహిస్తున్న టీచర్,ఆయా పనితీరు పట్ల జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అంగన్వాడి సెంటర్ లోనికి వెళ్లడానికి చిన్నారులు పడుతున్న ఇబ్బందులను గమనించి, చిన్నారులు సులువుగా అంగన్వాడి సెంటర్ లోనికి వెళ్లేందుకు ఐరన్ బెంచ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ను ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ లో ఉన్న సరిహద్దు వివాదం ఉందన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించేందుకు వెంటనే సర్వే ప్రక్రియ పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో త్వరలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఇస్తామని జిల్లా కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. స్థానికంగా ఉంటున్న ప్రజలు తమకు ప్రభుత్వం ఇచ్చారని, వాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగలేదని జిల్లా కలెక్టర్ ముందు వాపోయారు.

ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి ధృవీకరణ పత్రాలను అందజేస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాహాశీల్దార్ నలిని, పి. హెచ్.సి సబ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రవితేజ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు.

## విశేష సేవలందిస్తోన్న వాలంటీర్లకు సేవా మిత్ర, రత్న, వజ్ర అవార్డుల ప్రధానం

గోకవరం ప్రజా పాలన మే 23: గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు విశేష సేవలందిస్తోన్న వాలంటీర్లకు వందనం పేరిట ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రధానం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక ఎస్వీఆర్ పంక్షన్ హాల్లో వాలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి తారీఖునే రంఛన్ గా లబ్ధిదారుల గడప వద్దకు వెళ్ళి , ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లను అవ్వాతాతలకు అందించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై వాలంటీర్లు అవగాహన కల్పిస్తున్నారన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించడం, అర్హులందరికీ లబ్ధి అందేలా చేయి పట్టుకొని నడిపిస్తూ, ప్రతి 50 ఇళ్లకు ఒక బిడ్డగా ఉంటూ వైఎస్ జగన్ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలబడి సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా సేవలందిస్తున్న వాలంటీర్ చెల్లెమ్మలకు, వాలంటీర్ తమ్ముళ్లకు సెల్యూట్ చేస్తూ వారి సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా అందిస్తున్న చిరు సత్కారమే అవార్డుల ప్రధానం అన్నారు. మండలంలో 276మంది వాలంటీర్లు గాను ఇద్దరికీ సేవా వజ్ర, 5గురికి సేవా రత్న అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు.మిగిలిన వాలంటీర్లు కు సేవా మిత్రగా గుర్తించడం జరిగిందన్నారు. గోకవరం 2లో పనిచేస్తున్న వాలంటీర్ సిమిలి కృష్ణవేణి , కొత్తపల్లి 2 లో వాలంటిర్ దిండి న్యూ దుర్గ లకు సేవా వజ్ర అవార్డులకు ఎంపికయ్యారు. వారికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ. 30,000 నగదు బహుమతి తో పాటు సేవా వజ్ర పురస్కారాల ప్రధానం చేశారు. అలాగే మల్లవరం1లో వజ్రంగి లోవబాబు, గోకవరం 1 లో అల్లాడ వీరబాబు, గోకవరం 2లో పిన్నిటి శివలక్ష్మీదేవి, మల్లవరం 1లో పిత కల్పన, గుమ్మళ్లదొడ్డి లో పెనుగుల శ్రీ దేవి లకు సేవా రత్న పురస్కారాల ప్రధానంతో పాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ. 20,000 నగదు బహుమతి లభించింది. మిగిలిన వవాలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాల ప్రధానం సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ. 10,000 నగదు బహుమతి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి పి సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబు, సచివాలయం మండల కన్వీనర్ దాసరి రమేష్, వరసాల ప్రసాద్, పాటి రాంబాబు, కర్రి సూరారెడ్డి, గుల్లా ఏడుకొండలు, అక్షింతల రాజా, చింతల అనిల్ కుమార్, నరలశెట్టి నర్సయ్య, పెద్దాడ వెంకన్నదొర, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు: జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి, ప్రజాపాలన ప్రతినిధి : వివిధ మీడియా సంస్థలలో పనిచేస్తున్న అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అధ్యక్షతన కలెక్టరేట్ మినీ విసి హాల్లో మంగళవారం మధ్యాహ్నం 2023 మరియు 2024 సంవత్సరానికి ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న అక్రిడేషన్ కార్డులకు సంబంధించి నూతన అక్రిడేషన్ల జారీ పై జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం 2 సంవత్సరాల కాలపరిమితితో జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడేషన్ల మంజూరు నిమిత్తం ప్రభుత్వ ఉత్తర్వులు : 38 జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఐ అండ్ పి ఆర్ ) డిపార్ట్మెంట్ తేది. 30.03.2023 జారీ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను అనుసరించి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా నిబంధనలు మేరకు అర్హతలు కలిగిన పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం సమర్పించిన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, పిరియాడికల్, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులలో అన్ని నిబంధనలు పూర్తిచేసిన వారికి మొదటి విడతలో 277 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరికి త్వరలోనే కార్డులు మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం అక్రిడేషన్ మంజూరు కాని వారికి జీవోలోని నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్స్ అన్ని ఆన్లైన్ ద్వారా సమర్పించిన పిదప తదుపరి కమిటీ సమావేశంలో పరిశీలించి అక్రిడిటేషన్లు మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో జర్నలిస్ట్ బస్ పాస్ ఎలిజిబుల్ అయ్యేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.లిఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనరు మరియు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ పురుషోత్తం, పిఆర్ఓ ధర్మ నాయక్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నరసింహారాజు (ఈనాడు), కృష్ణయ్య (ఆంధ్రప్రభ), సర్ఫరాజ్ (సాక్షి), మురళి (సివిఆర్), జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య, కార్మిక శాఖ, ఆర్టీసీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## మండల వైసీపీ మహిళా అధ్యక్షురాలుగా మేడిశెట్టి సత్యవేణి



గోకవరం, ప్రజా పాలన వే 24: గోకవరంమండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా మేడిశెట్టి సత్యవేణి ని నియమించినట్లు జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీరంగ, నాయకులు దాసరి రమేష్ స్వగృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు సమక్షంలో తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కృష్ణ బలిజ ఉపాధ్యక్షులు తుపాకుల గణేష్, మండలం కృష్ణ బలిజ సంఘం అధ్యక్షురాలు తుపాకుల బాపనమ్మ తో పాటు గోకవరం ఆర్యవైశ్య సంఘం నాయకులు కంచర్ల అవినాష్ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్పనతను కలిసి ఉపాధ్యాయ బదిలీల విషయంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాల మీద రిప్రజెంటేషన్ ఇస్తున్న డెమోక్రటిక్ పి ఆర్ టి యు గుంటూరు జిల్లా అధ్యక్షులు జువ్వా జ్ఞానేశ్వరరావు



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 24, మే 2023

## 'మద్యాంధ్రప్రదేశ్'గా మార్చడమే లక్ష్యం!

వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో 'దశలవారీ మద్యనిషేధం' అమలు చేస్తామని ఊదరగొట్టి మహిళల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చారు. మద్యం వల్ల రాష్ట్రంలో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, పేద ప్రజలు ఆరోగ్యం దెబ్బతిని, వైద్యం చేయించుకోలేని దుస్థితిలో తనువు చాలిస్తున్నారని, రాష్ట్రంలో ప్రతి అవ్వ%--%తల్లి%--%అక్క%--%చెల్లెలు చల్లగా ఉండాలంటే అన్ని కుటుంబాలు మద్యం మహమ్మారి నుంచి బయటపడి వారి కుటుంబాల నికర ఆదాయం పెరగాలని అంటూ తన నవరత్నాల్లో ఒకటిగా దీనిని ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజున దశలవారీ మద్య నియంత్రణపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని పునరుద్ఘాటించారు. అనంతరం 2019 అక్టోబర్‌లో వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డిని మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్‌గా రాజకీయ పునరావాస నియామకం జరపడం మినహా, ఇప్పటివరకు ఈ అంశంలో ఏ పురోగతీ లేదు. వైసీపీ విధానం 'దశలవారీ మద్యం నిషేధం' అని చెప్పి అధికారంలోకి వచ్చి, అనంతరం యూ టర్న్ తీసుకొని ప్రభుత్వ ఆదాయం కోసం మద్యం వినియోగం పెంచే పనిలో నిమగ్నమయ్యారు. నమ్మి ఓటు వేసిన మహిళలను వంచనకు గురి చేశారు.గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో మద్యం అంశంలో పాలన వ్యాపార కోణంలో సాగింది. 2019–20 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సయిజ్ పాలసీ అంటూ ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహిస్తుందని ప్రకటించడం ద్వారా మద్య నియంత్రణ ఆశయానికి తూట్లు పొడిచారు. 2020–21లో కరోనా సమయంలో మద్యం దుకాణాలు తెరచి ప్రభుత్వ ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద విధి నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2021–22 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని మద్యం షాపులను మద్యం నియంత్రణలో భాగంగా భారీగా తగ్గిస్తామన్న స్ఫూర్తికి తూట్లు పొడిచింది. 2022–23లో ఆర్థిక నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం వినియోగం నుంచి వచ్చే వ్యాట్ ఆదాయాన్ని బేవరేజ్ కార్పొరేషన్‌కి తరలించి 20 సంవత్సరాలలో తిరిగి చెల్లించే విధంగా 25,000 కోట్ల రూపాయిల రుణాలను సేకరించే ప్రణాళిక రచించారు. దీంతో జగన్ ప్రభుత్వ కాలంలో సంపూర్ణ మద్యనిషేధం హామీ హుళక్కి అయ్యింది. మద్య నిషేధం హామీ స్థానంలో దశలవారీగా మద్యం అమ్మకాలు, ప్రభుత్వ ఆదాయం పెరిగింది. నేడు దేశంలో ఎక్కడా లేని నాసిరకపు మద్యం ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత జగన్‌కే దక్కుతుంది. మద్యం మహమ్మారి ఆరోగ్యాన్ని బుగ్గి చేస్తుందని తెలిసిన పాలకులకు, నాసిరకపు మద్యం ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో తెలియదా? రాష్ట్రంలో మద్యం తయారుచేసే కంపెనీలు పాలకుల కుటుంబసభ్యులు చేతుల్లో, వారి అనుయాయులు, సహచరులు చేతుల్లో ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. ఈ అస్మదీయులు తయారు చేసిన నాసిరకపు మద్యం బ్రాండ్లనే రాష్ట్రప్రభుత్వం నిర్వహించే దుకాణాలలో దేశంలోనే అతి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దశలవారీ మద్య నిషేధం అని జగన్ అన్నప్పుడు, అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మద్య వినియోగ నియంత్రణ కోసం 'డీ అడిక్షన్ సెంటర్లు' ప్రారంభిస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ ఇప్పుడు బడి, గుడి అనే భేదం లేకుండా నిస్సిగ్గుగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నది. మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున జాతీయ, ఆర్ అండ్ బి రహదారులకు ఆనుకొని మద్యం దుకాణాలు ఉండకూడదనే నిబంధనలున్నా, దీనిపై సుప్రీంకోర్టు తీర్పులున్నా, ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిబంధనలు బేఖాతరు చేస్తూ మద్యం అమ్మకాలు, దాని ద్వారా ఆదాయం పెంచుకొనే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమయింది. జంగారెడ్డిగూడెంలో నాటు సారా వల్ల 25 మంది మరణించారు. ఆ విషాదం వెనుక ఉన్నవారి హస్తం ఇప్పటివరకు ఎందుకు బయటకు రాలేదు? వీటిని సహజ మరణాలుగా చిత్రించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చేయలేదా? రాష్ట్రవ్యాప్తంగా నాటు సారా నియంత్రణలో దారుణంగా ప్రభుత్వం విఫలమైంది. మరోవంక ప్రభుత్వమే మద్యం వ్యాపారంలో పూర్తిగా నిమగ్నమైపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాలు నాసిరకపు మద్యాన్ని అమ్ముతున్నందున, వైసీపీ నాయకుల అండదండలతో కొందరు ప్రీమియం బ్రాండ్ల మద్యాన్ని సరిహద్దు రాష్ట్రాల నుంచి తెచ్చి ఆంధ్రప్రదేశ్‌లో తెరచాటు వ్యాపారం చేస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మద్యం పాలసీ లోపభూయిష్టంగా ఉన్నందున మద్యం చుట్టూ రాష్ట్రంలో అనేక అకృత్యాలు జరుగుతున్నాయి.వైసీపీ తన మ్యానిఫెస్టోలో దశలవారీ మద్యం నిషేధం అన్నందున, ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక వాస్తవంగా రాష్ట్రంలో మద్యం ద్వారా వచ్చే ఎక్సయిజ్, వ్యాట్ ఆదాయం ప్రతి సంవత్సరం క్రమంగా తగ్గాలి. కానీ దానికి విరుద్ధంగా మద్యంపై ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతూ అంబరాన్ని తాకే వేగంతో దూసుకెడుతోంది. గడచిన నాలుగు సంవత్సరాల మద్యం ఆదాయం గణాంకాలు విశ్లేషిస్తే, ప్రస్తుత వ్యాట్, ఎక్సయిజ్ డ్యూటీ, ప్రత్యేక జీఓ ద్వారా అధిక రుణాలకోసం మద్యం పైన వ్యాట్ శాతం తగ్గించి బేవరేజ్ కార్పొరేషన్‌కు తరలించిన మొత్తం కలిపి రాష్ట్ర ప్రభుత్వం మద్యంపై పన్నుల రూపంలో ఆర్జించిన ఆదాయం రమారమి ఇలా ఉంది. 2019–20లో 17,300 కోట్లు, 2020–21లో 21,500 కోట్లు, 2021–22లో 26,700 కోట్లు, 2022–23లో 30,600 కోట్లుగా ఉంది. అంటే మద్య నిషేధం హామీ నుంచి తప్పుకొని, క్రమంగా ఆ ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడిపే దుస్థితికి జగన్ రాష్ట్రాన్ని తెచ్చారు.దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివిధ వ్యవహారాలకు సంబంధించిన రోజువారీ నగదు చెల్లింపులు డిజిటల్ మాధ్యమంలో చెయ్యాలని సంకల్పించి కరోన సమయంలో బాగా ప్రోత్సహించారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక చెల్లింపులు కూడా నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలోకే నిధులు బదిలీ చేస్తున్నారు. ఈ తరుణంలో నేడు ప్రపంచంలోనే అత్యధిక మొత్తంలో డిజిటల్ లావాదేవీలు నెరుపుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఈ మధ్య ముఖ్యమంత్రి జగన్ కూడా డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించే దిశగా ప్రచారం చేయాలని ప్రకటించారు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వమే నిర్వహిస్తున్న మద్యం దుకాణాలలో లావాదావీలు నగదుకే పరిమితం చేసి డిజిటల్ చెల్లింపులను తుంగలో తొక్కారు. దీనికి కారణం, మద్యం తయారు చేస్తున్న కంపెనీలు అధికారంలో ఉన్నవారివి కావడం, ఆ మద్యమే ప్రభుత్వం నిర్వహించే దుకాణాలలోకి సరఫరా చేయడం, తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన వ్యాట్, ఎక్సయిజ్, ప్రత్యేక జీఓతో బేవరేజ్ కార్పొరేషన్‌కి వెళ్లాల్సిన ఆదాయం లెక్కల్లో చూపకుండా దారి మళ్లించడం జరుగుతోంది. ఈ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి చేరుతున్నదో సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తేగాని తేలదు.మద్య నిషేధం హామీ తుంగలోకి తొక్కినందున జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలే తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది. కేవలం మద్యం ఆదాయంతోనే రాష్ట్ర ప్రభుత్వం నడిచే దుస్థితి మన రాష్ట్రానికి తప్ప, దేశంలోని మరే రాష్ట్రానికీ లేదు. ఎప్పుడైతే బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా 20 సంవత్సరాలకు రుణాలు తీసుకున్నారో, అప్పుడే రాబోయే 20 సంవత్సరాల్లో మద్య నిషేధం లేదని జగన్ తేల్చేశారు. ఢిల్లీ రాష్ట్ర సర్కారు అవినీతితో మద్యం వ్యాపార లావాదేవీలు జరపడంతో బహిర్గతమైన స్కామ్ కన్నా, ఆంధ్రప్రదేశ్‌లో మద్యం అవినీతి తీవ్రత ఎక్కువ అనే వాదన ఉన్నందున, రాబోయే కాలంలో జాతీయ విచారణ సంస్థల ద్వారా నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉన్నది.

# మోదీ హయాం.. భారత్‌కు శాపం

దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో 2017 మార్చిలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 44 ఏండ్ల వయసున్న యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవిని చేపట్టారు. హిందుత్వ శ్రేణులు ఆయనను 'హిందూ సింహం'గా అభివర్ణించాయి. నిజంగానే, విద్వేష హిందూ రాజకీయాల్లో ఆయనది అందెవేసిన చేయి. ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్, రచయిత, కాలమిస్టు అశోకా మోదీ రాసిన 'ఇండియా ఈజ్ బ్రోకెన్‌బీ ఎ పీపుల్ బిట్రేయ్డ్, 1947 టు టుడే' గ్రంథం 75 ఏండ్ల భారత ప్రస్థానంపై ఒక సాధికారిక వ్యాఖ్యానం. స్వాతంత్ర్యానంతరం ఎన్నో ఆశలతో జీవితాలు మెరుగుపడుతాయని ఆశించిన భారతీయులను వరుస ప్రభుత్వాలు ఏ విధంగా నిరాశకు గురి చేశాయో ఈ పుస్తకంలో ఆయన విశదీకరించారు. మరీ ముఖ్యంగా, మోదీ ప్రధాని అయిన తర్వాత భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎలా కుప్పకూలిందో, న్యాయ, మీడియా రంగాలు ఎలా అణచివేతకు గురయ్యాయో తెలిపారు. భారతదేశంలో ప్రజాస్వామ్యమే ఉనికిలో లేకుండా పోయిందని, భారత్ 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' (ఎన్నికలు జరిగే నియంతృత్వ రాజ్యం)గా మారిపోయిందని విశ్లేషించారు. ఈ పుస్తకంలోని కొన్ని భాగాలు ఢిల్లీలో అధికారం చేపట్టిన పార్టీలు అనుసరించిన అపసవ్య విధానాల వల్ల దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ప్రజలు ముఖ్యంగా యువత అసంతృప్తితో రగిలిపోయింది. ఇటువంటి సమయంలో 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ఈ పరిస్థితులకు హిందుత్వను జోడించారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. ఆ ఏడాది మే నెలలో ప్రధానమంత్రి పదవిని మోదీ అధిష్ఠించారు. మరుసటి నెలలోనే మూకదాడులు మొదలయ్యాయి. పుణెలో ఒక ముస్లిం సాఫ్ట్‌వేర్ నిపుణుడిని.. ఫేస్‌బుక్‌లో రెచ్చగొట్టే వీడియో పెట్టాడని ఆరోపిస్తూ ఒక మూక కొట్టి చంపింది. మరోవైపు, హిందుత్వ డిజిటల్ సైనికులు తమ కార్యకలాపాలను ఉధృతం చేశారు. వాజపేయి హయాంలో మంత్రిగా పని చేసి, అనంతర కాలంలో మోదీ, షాల విమర్శకుడిగా మారిన అరుణ్‌శౌరీనీ వారు వదల్లేదు. దివ్యాంగుడైన ఆయన కుమారుడిపై సోషల్ మీడియాలో తిట్లు కురిపించారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ మేధావి, హిందుత్వ రాజకీయాల విమర్శకుడైన ఎంఎం కల్బుర్గిని ఆగస్టు 2015లో ధార్వాడ్‌లోని ఆయన ఇంటిలోనే హత్య చేశారు. అక్టోబర్‌లో ఢిల్లీ శివార్లలోని గ్రేటర్ నోయిడాలో ఆవు మాంసం తిన్నాడని ఆరోపిస్తూ ఒక ముస్లింను చంపారు.దేశ తొలి హోంమంత్రి వల్లభాయ్ పటేల్‌ను హిందుత్వ సిద్ధాంతకర్తగా అభివర్ణించే ప్రయత్నం పెద్ద ఎత్తున మొదలైంది. నిజానికి, పటేల్ నికరమైన గాంధేయవాది. జీవితాంతం గాంధేయ విలువలైన అహింస, సహనం పాటించారు. మైనారిటీలైన ముస్లింల పట్ల ఆయన ఏనాడూ వివక్ష చూపలేదు. అటువంటి పటేల్‌ను హిందుత్వ సానుభూతిపరుడిగా చిత్రీకరించటం అంటే, చరిత్రను పూర్తిగా వక్రీకరించటమే. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజులకే, ఐక్యతా విగ్రహం పేరుతో ప్రపంచంలోనే అతిపెద్దదైన 182 అడుగుల పటేల్ విగ్రహం ఏర్పాటుకు మోదీ చర్యలు చేపట్టారు. రూ.3,300 కోట్ల వ్యయంతో ఆ విగ్రహం 2018 నాటికి పూర్తయ్యింది. విగ్రహం ప్రారంభోత్సవాన్ని హిందూ సంప్రదాయ పద్ధతిలో మోదీ నిర్వహించారు. విగ్రహ ఏర్పాటు కోసం అక్కడి నుంచి తరలింపునకు గురైన స్థానికులు తమకు పునరావాస పరిహారం తగినంత ఇవ్వలేదని నిరసన తెలుపుతుంటే, వారిని పోలీసులు అడ్డుకున్నారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో 2017 మార్చిలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 44 ఏండ్ల వయసున్న యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవిని చేపట్టారు. హిందుత్వ శ్రేణులు ఆయనను 'హిందూ సింహం'గా అభివర్ణించాయి. నిజంగానే, విద్వేష హిందూ రాజకీయాల్లో ఆయనది అందెవేసిన చేయి. 1998లో ఆదిత్యనాథ్




'గో రక్ష మంచ్' ను ప్రారంభించారు. ఆవుల రక్షణ అనే అంశం మతపరమైన చీలికలు తీసుకురావటానికి పెద్దగా ఉపయోగపడటం లేదని గ్రహించి, 2002లో హిందూ యువవాహినిని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఏకైక ఎజెండా, ముస్లింలు హిందువుల శత్రువులని ప్రచారం చేయటం, ముస్లింలపై హిందువుల్లో ద్వేషాన్ని రేకెత్తించ టం. ఈసారి ఆదిత్యనాథ్ తంత్రం ఫలించింది. ఆయన స్వస్థలం, యూపీలోని అనేక వెనుకబడిన పట్టణాల్లో ఒకటైన గోరఖ్‌పూర్‌లో మతపరమైన అల్లర్లు, దొమ్మీలు తరచూ చోటుచేసుకోవటం మొదలైంది. ఈ విధంగా రాజకీయాల్లో ఎదిగిన ఆదిత్యనాథ్, యోగిగా పేరొంది, ఆ తర్వాత సీఎం అయ్యారు. యూపీలో దశాబ్దాలుగా ఉన్న 'నేరస్థులు–రాజకీయ నేతల కూటమి' అనే సంప్రదాయాన్ని యోగి కొనసాగించారు. రాష్ట్రాన్ని ఈ సంప్రదాయం భ్రష్టుపట్టించింది. అయినా, యోగి దానిని ముందుకు తీసుకెళ్లారు. ఆయన క్యాబినెట్‌లో దాదాపు సగం మందిపై తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలున్నాయి. స్వయంగా యోగిపైనే.. హత్యాయత్నం, విధ్వంసం, అల్లర్లు, బెదిరింపులకు పాల్పడటం వంటి కేసులు అప్పటికే నమోదై ఉన్నాయి. దేశవ్యాప్తంగా తన విమర్శకుల నోళ్లను మందబలంతో మూయించటంలో హిందుత్వ విజయం సాధించింది. 2017 జూలైలో బెంగళూరులో ప్రముఖ జర్నలిస్టు, సామాజిక ఉద్యమకారిణి గౌరీ లంకేశ్‌ను ఆమె ఇంటి ముందే ఇద్దరు దుండగులు తుపాకితో కాల్చి చంపారు. ఆమె హత్యను హిందుత్వ శ్రేణులు ట్విట్టర్‌లో పండుగలా జరుపుకొన్నాయి. ఆ శ్రేణుల్లో నిఖిల్ దడిచ్ ఒకరు. 'గౌరీలంకేశ్ కుక్క చావు చచ్చింది. ఇతరులకూ అదే గతి పడుతుంది' అంటూ నిఖిల్ ట్వీట్ చేశాడు. ఆయనను ట్విట్టర్‌లో ఫాలో అయ్యే వాళ్లలో ప్రధాని నరేంద్రమోదీ కూడా ఒకరు. హిందుత్వ శక్తులు నూతనోత్సాహంతో చరిత్రకు కొత్త వ్యాఖ్యానాలు చేయటం ప్రారంభించాయి. దీనికి ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. తాను ప్రధాని అయిన ఐదు నెలలకు 2014 అక్టోబర్‌లో జరిగిన ఓ వైద్యుల సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రాచీన భారతదేశంలో వైద్యపరంగా అనేక అద్భుతాలు జరిగాయని చెబుతూ, కర్ణుడు తల్లి గర్భం నుంచి జన్మించలేదని, ఇది నాటి జన్యుశాస్త్ర అభివృద్ధికి నిదర్శనమన్నారు. వినాయకుడికి ఏనుగు తొండాన్ని అమర్చటం నాటి ప్లాస్టిక్ సర్జరీకిఉదాహరణ అని చెప్పారు.బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రప్రభుత్వాలు చరిత్ర పుస్తకాల్లోని పాఠ్యాంశాలలో మార్పులు మొదలుపెట్టాయి. మధ్యయుగాల నాటి ముస్లిం పాలకుల తాలూకు అంశాలను తొలగించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో నెహ్రూ పోషించిన పాత్రను మోదీ విమర్శించారు. దీంతో నాడు బీజేపీ పాలనలో ఉన్న రాజస్థాన్‌లో 8వ తరగతి పుస్తకం నుంచి నెహ్రూకు సంబంధించిన అంశాలన్నింటినీ తొలగించి వేశారు.2018 జనవరి 1న పశ్చిమ మహారాష్ట్రలోని ఓ చిన్న గ్రామం భీమా కోరేగావ్‌లో జరుగుతున్న దళితుల విజయోత్సవాలపై హిందుత్వ సంస్థలు దాడి జరిపాయి. 200 ఏండ్ల కిందట అదే రోజున అక్కడ జరిగిన యుద్ధంలో బ్రాహ్మణుడైన పీష్వా మహారాజు సైన్యంపై దళితులతో కూడిన బ్రిటీష్ రెజిమెంట్ విజయం సాధించింది. తరతరాలుగా తమను కులం పేరుతో అణగదొక్కిన వారిపై విజయానికి గుర్తుగా దళిత సంఘాలు అక్కడ విజయోత్సవాలు నిర్వహిస్తుంటాయి. కానీ, మోదీ ప్రధాని అయిన తర్వాత ఇది హిందుత్వ శక్తులకు కంటగింపుగా మారింది. దానిపై దాడి జరిపారు. దళితుల అభ్యున్నతి పట్ల సానుభూతి ఉన్న ఐదుగురిని నక్సలైట్ల పేరుతో పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాని మోదీని హత్య చేసి, ఆయన ప్రభుత్వాన్ని కూల్చటానికి వారు కుట్ర పన్నారని అభియోగం మోపారు. విచారణ వేగంగా జరుగకుండా, కనీసం బెయిల్ కూడా రాకుండా వారిపై నల్లచట్టం ఉపాను మోపారు. నేటికీ ఈ కేసు వారిపై కొనసాగుతున్నది.2019 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి నిరాశజనకంగా ఉంది. జీడీపీ వృద్ధి రేటు పడిపోతూనే ఉన్నది. నిరుద్యోగం పెచ్చరిల్లింది. ముఖ్యంగా, ఒక ప్రణాళిక అంటూ లేకుండా తీసుకొచ్చిన నోట్లరద్దు, జీఎస్టీ వల్ల ఉద్యోగాల మీద పెద్ద దెబ్బ పడింది. ఆ ఏడాది మార్చిలో వాషింగ్టన్‌కు చెందిన 'ప్యూ రీసెర్చ్ సెంటర్' భారత్‌లో జరిపిన సర్వేలో పాల్గొన్న వారిలో 76 శాతం మంది ఉద్యోగావకాశాలు లేకపోవటమే తమ అతి పెద్ద సమస్య అని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు మరికొన్ని నెలల వ్యవధి మాత్రమే ఉంది. ఐదేండ్ల కాలంలో మోదీ చెప్పుకోదగిన విజయాలు ఏమైనా ఉన్నాయా అంటే, ఒకటి, స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మరుగుదొడ్ల నిర్మాణం, రెండు.. పేదలకు సబ్సిడీపై వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ. దేశవ్యాప్తంగా 10 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని మోదీ చెప్పుకొన్నారు. వీటివల్ల దేశంలో పారిశుద్ధ్యం మెరుగుపడిన మాట వాస్తవమే. అయితే, స్వతంత్ర అధ్యయనాల వల్ల తెలిసిందేమిటంటే, తొందరగా నిర్మించాలన్న ఆత్రుతతో మరుగుదొడ్లను అడ్డదిడ్డంగా కట్టారు. అనేక చోట్ల నీటి సదుపాయం కల్పించలేదు. కొన్ని కూలిపోయాయి. మరికొన్ని వినియోగించుకోవటానికి వీల్లేకుండా తయారయ్యాయి. చాలాచోట్ల డ్రైనేజీతో కలుపక పోవటం వల్ల, వ్యర్థాలు భూగర్భ జలాల్లో కలిశాయి. బహిరంగ మల విసర్జన నేటికీ పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. మరో విషయం ఏమిటంటే, భారతదేశంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చటంలో, మరుగుదొడ్ల నిర్మాణం అన్నది ఒక అంశమే కానీ, అదే పూర్తి పరిష్కారం కాదు. నదుల్లో కాలుష్యం, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు అలాగే ఉన్నాయి. నమామి గంగే పేరుతో గంగానది ప్రక్షాళన కోసం మోదీ చేపట్టిన ప్రాజెక్టు కూడా ఫలితాలను ఇవ్వలేదు. పర్యాటకులు ఎక్కువగా సందర్శించే ప్రాంతాలను మాత్రమే ఈ ప్రాజెక్టులో భాగంగా మెరుగుపరిచారు. అంతేగాని, ఆ నదిలోకి భారీ ఎత్తున వచ్చి పడుతున్న పారిశ్రామిక, మానవ వ్యర్థాలను అడ్డుకోలేదు.వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం కింద, సిలిండర్లను, గ్యాస్ స్టవ్‌ను సబ్సిడీతో మహిళలకు అందించారు. కట్టెల పొయ్యి పొగ నుంచి మహిళలకు విముక్తి కల్పించి వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి ఈ పథకాన్ని భారీ ప్రచారంతో ప్రారంభించారు. కానీ, పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరల కారణంగా, కొత్త సిలిండర్‌ను తీసుకోవటం కోట్లాదిమంది నిరుపేద మహిళలకు భారమయ్యింది. ఖాళీ సిలిండర్‌ను పక్కన పెట్టారు. కట్టెల పొయ్యే వారికి మళ్లీ దిక్కయ్యింది. ఈ విధంగా, ఎన్నికల సమయానికి ఈ రెండు పథకాలతో ఇక ఓట్లు రావని అర్థమైంది. దీంతో హిందుత్వతో కూడిన జాతీయవాదం తెరపైకి వచ్చింది. 2019 ఫిబ్రవరి 14న కశ్మీర్‌లో సైనికుల కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి జరిగింది. 40 మంది జవాన్లు మరణించారు. దేశానికి చౌకీదార్‌ను అని చెప్పుకున్న మోదీ, ఈ దాడికి ప్రతిగా పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి నిర్వహించారు. అయితే, ఆ ప్రాంతాన్ని సందర్శించిన జర్నలిస్టులకు అక్కడ వైమానిక దాడి జరిగిన ఆనవాళ్లేమీ కనిపించలేదు. అయినప్పటికీ, భారతదేశంలో సోషల్‌మీడియాలో జాతీయవాద ప్రచారం పెద్ద ఎత్తున మొదలైంది. 12 లక్షల మంది బీజేపీ సోషల్ మీడియా వలంటీర్లు ఈ ప్రచారాన్ని ముందుండి నడిపించారు. ఓ వీడియోగేమ్ నుంచి తీసుకున్న క్లిప్‌ను, పాకిస్థాన్ మీద భారత్ జరిపిన వైమానిక దాడిగా సృష్టించారు.దీనికి తోడుగా అదే నెలలో జరిగిన కుంభమేళాలో యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. అండమాన్ జైలులో సావర్కర్‌ను నిర్బంధించిన గదిని మోదీ సందర్శించారు. అక్కడున్న సావర్కర్ ఫొటో ముందు ధ్యానముద్రలో కూర్చున్నారు. ఆ ఫొటోను మోదీనే స్వయంగా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 2014 ఎన్నికల నాటి ఆర్థికాభివృద్ధి హామీ, గుజరాత్ మాడల్ వంటివన్నీ కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో, పాకిస్థాన్‌ను ఎదుర్కోగల దీటైన నేత మోదీ అనే ఇమేజీ, హిందుత్వ వచ్చి చేరాయి. బీజేపీ సోషల్ మీడియాలో కీలక బాధ్యతలు నిర్వహించి, ఆ పార్టీపై భ్రమలు తొలగిన తర్వాత బయటకు వచ్చిన ఒక వ్యక్తి.. '2014 ఎన్నికలు అభివృద్ధి ఎజెండాగా జరిగితే, 2019 ఎన్నికలు మతవిద్వేషాల ఆధారంగా జరిగాయి' అని వ్యాఖ్యానించటం పరిస్థితికి అద్దం పట్టింది.ఎన్నికలు దగ్గర పడిన ఏప్రిల్, మే నెలల నాటికి సోషల్ మీడియాలో విద్వేష ప్రచారం జోరందుకున్నది. వాట్సాప్, ఫేస్‌బుక్ కొన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్‌కు, సీనియర్ బీజేపీ నేతలకు మినహాయింపునిచ్చాయి. ముఖ్యంగా, ఫేస్‌బుక్ ద్వారా పెద్ద ఎత్తున విద్వేష ప్రచారం జరిగిందని ఫేస్‌బుక్ అంతర్గత నివేదికలే వెల్లడించాయి. ఫ్రాన్స్ హౌగెన్ అనే విజిల్ బ్లోయర్ ఈ విషయాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల ఖర్చు అమెరికా అధ్యక్ష ఎన్నికలను మించిపోయింది. లోక్‌సభ ఎంపీల్లో ఎన్నడూ లేని విధంగా 29 శాతం మందిపై హత్య, కిడ్నాప్, డబ్బు వసూళు వంటి సీరియస్ క్రిమినల్ కేసులున్నాయి. అంటే ప్రతి నలుగురిలో ఒకరికన్నా ఎక్కువ మందిపై. బీజేపీలో కూడా ఇదే వరుస. ఆ పార్టీ నుంచి ఎన్నికైన ఎంపీల్లో 29 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 2017లో మోదీ సర్కారు ఎలక్టోరల్ బాండ్లు అనే కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది. తమకు ఇష్టం ఉన్న రాజకీయ పార్టీకి వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ఎంతైనా నిధులను అందజేసే విధానం ఇది. విరాళాలు ఇచ్చిన వ్యక్తులు తమ వివరాలను బయటపెట్టటం తప్పనిసరేమీ కాదు. ఎన్నికల సంఘమే స్వయంగా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. కానీ, కోర్టు ఏమీ తేల్చలేదు. ఫలితంగా, బీజేపీ లాభపడింది. సదరు బాండ్ల వల్ల వచ్చిన నిధుల్లో 95 శాతం బీజేపీకే వెళ్లాయి. డబ్బుల కోసం మరో మార్గం.. షెల్ కంపెనీలు. ఎక్కడా అడ్రస్ లేని ఈ కంపెనీల ద్వారా రాజకీయ పార్టీలకు, నేతలకు డబ్బు ప్రవహించింది.

## ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్ గా మలీశా

ముంబై, మే 23, :ముంబయిలోని ఓ మురికి వాడ. ఇరుకైన ఇల్లు. అందులో ఓ 14 ఏళ్ల బాలిక. ఆమె కలల్ని ఆ నాలుగు గోడలు అడ్డుకోలేకపోయాయి. మెల్లగా ఇల్లు దాటాయి. అక్కడి నుంచి వాడ దాటి..ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయి. అప్పటి వరకూ చాలా సాదాసీదా జీవితం గడిపిన ఆ బాలిక..ఇప్పుడు బ్రాండ్ అంబాసిడర్ అయిపోయింది. ఫేమస్ మ్యాగజైన్ కవర్ పేజీలపైనా తన ఫోటోలు కనిపిస్తుంటే..అవి చూసుకుని తెగ మురిసిపోతోంది. ధారావిలోని మలీశా ఖర్వా కథ ఇది. ఇప్పుడామెని అంతా ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్ గా పిలుచుకుంటున్నారు. 2020లో హాలీవుడ్ యాక్టర్ రాబర్ట్ హాఫ్‌మాన్ ఆమెని గుర్తించి ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆమెకు ఆర్థిక సాయం చేయాలంటూ గో ఫండ్ మీ పేజీ క్రియేట్ చేశాడు. ఆ తరవాత ఒక్కసారిగా ఆమె పాపులారిటీ పెరిగిపోయింది. అప్పటి వరకూ ఆమె ఎవరో కూడా తెలియని వాళ్లు "ఎవరీ మలీశా" అని సెర్చ్ చేయడం మొదలు పెట్టారు. క్రమంగా ఆమెకు ఫాలోయింగ్ పెరిగింది. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2 లక్షల 25 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె పెట్టే ప్రతి పోస్ట్‌కి చజూతీతినిఇవబబటతీనీఎబిష్ట్రవబశ్రీబీఎ అనే హ్యాష్‌ట్యాగ్ యాడ్ చేస్తుంది. ఎందుకంటే నెటిజన్లు ఆమెని అలాగే గుర్తిస్తున్నారు మరి. ఫాలోయింగ్ పెరగడమే కాదు. మోడలింగ్ అవకాశాలూ వచ్చాయి. అలా ఈ ఫీల్డ్‌లోకి వచ్చేసింది మలీశా. లివ్ యువర్ ఫెయిర్ టైల్ అనే షార్ట్‌ఫిల్మ్‌లోనూ తళుక్కుమంది. ఇప్పుడు మరో అదిరిపోయే ఆఫర్ ఆమెని వెతుక్కుంటూ వచ్చింది. ఫారెస్ట్ ఎసెన్షియల్స్ అనే ఓ కాస్మొటిక్స్ కంపెనీ యువతి సెలక్షన్ పేరిట ఓ క్యాంపెయినింగ్ స్టార్ట్ చేసింది. యువతను ఎంపవర్ చేయడమే ఈ క్యాంపెయిన్ ఉద్దేశం. ఈ ప్రచారానికి మలీశా ఖర్వాని ఎంపిక చేసింది ఆ కంపెనీ. ఏప్రిల్‌లో ఆమెకు ఈ ఆఫర్ ఇచ్చింది. అంతే కాదు. ఆమెని వెంటబెట్టుకుని తమ స్టోర్‌కి తీసుకెళ్లింది. ఆ స్టోర్‌కి ఎదురుగా ఓ హోర్డింగ్ కనిపించింది. దానిపై మలీశా తన ఫోటోను చూసి మురిసిపోయింది. ఒక్కసారిగా తన ముఖం వెలిగిపోయింది. "కలలు నిజం అవుతాయి అనడానికి ఓ అందమైన ఉదాహరణే మలీశా కథ" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఫారెస్ట్ ఎసెన్షియల్స్ కంపెనీ. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్టోర్‌లో మలీశా దిగిన ఫోటోలూ వైరల్ అయ్యాయి. మలీశా లాంటి ఎంతో మంది యువతను ప్రపంచానికి పరిచయం చేయాలన్నదే తమ లక్ష్యమని ఫారెస్ట్ ఎసెన్షియల్స్ ఫౌండర్ మీరా కులకర్ణి చెప్పారు. ఇంత సక్సెస్ వచ్చినా సరే...మలీశా చదువు పక్కన పెట్టలేదు. ఇటు మోడల్‌గా రాణిస్తూనే అటు స్టడీని కంటిన్యూ చేస్తోంది. "ఫారెస్ట్ ఎసెన్షియల్స్ ఆఫర్ వచ్చిందంటే ఇంకా నమ్మలేకపోతున్నాను. నాకు మోడల్ అవ్వాలనుంది. కానీ...చదువుకే నా ఫస్ట్ ప్రయారిటీ" అని చెబుతోంది మలీశా ఖర్వా

# మరో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆందోళన

## నిన్న రెడ్డి శాంతి...ఇవాళ కిరణ్



శ్రీకాకుళం, మే 23,:శ్రీకాకుళం జిల్లా అధికార పార్టీలో అసమ్మతి రాగం ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. నిన్నటికి నిన్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి వద్దు.. జగనన్న ముద్దు అంటూ నల్లబ్యాడ్జీలు ధరించి ఆమెకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అధికార పార్టీలో ఓ వర్గం ఆందోళనకు దిగింది. ఇది చల్లారక మునుపే ఎప్పటి నుంచో చాపకింద నీరులా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ పై వ్యతిరేకత ఒక్కసారిగా భగ్గుమంది. ఆ సెగ్మెంటు నుంచి శ్రీకాకుళం నగరం వరకు ఈ గ్రూపుల గోల పాకింది. నగరంలోని పీఎన్ కాలనీకి సమీపంలో గల కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కిరణ్‌కు వ్యతిరేకంగా అసమ్మతి వాదులు సమావేశం నిర్వహించి, రానున్న ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ బహిరంగంగానే సవాల్ విసరడం హాట్ టాపిక్ గా మారింది.ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెలరేగిన వివాదం తారాస్థాయికి చేరింది. అప్పటి నుంచి కిరణ్ కు వ్యతిరేకంగా వైసీపీ సీనియర్ నాయకులు బల్లాడ జనార్థన్ రెడ్డి, జరుగుళ్ల శంకర్ తో పాటు మరికొంత మంది గతంలో లావేరులో రహస్య సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేపై తిరుగుబాటు ప్రదర్శించారు. దీనిపై ఆ పార్టీలో ప్రముఖులైన విజయసాయిరెడ్డి, విజయ నగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ రెడ్డి ఓదార్చడంతో కాస్త సద్దుమణిగిందనుకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గం ఆదివారం ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరం వరకూ భారీ ర్యాలీ చేపట్టింది. వందలాది మంది తరలిరావడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఏం జరుగుతోందని అందరూ చర్చించుకుంటున్నారు. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది. నాయకుల మధ్య అంతర్గత పోరుతో నలిగిపోతున్న తరుణంలో ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణితో వర్గపోరు తీవ్రమైందని ఓ వర్గం బాహాటంగానే విమర్శిస్తోంది. వైసీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పై కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని అదే పార్టీ నేతలు బహిరంగ విమర్శలు దిగుతున్నారని అన్నారు.ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సొంత పార్టీ నుంచి అసమ్మతి స్వరాలు వినిపించడంతో ఎమ్మెల్యే వర్గీయులు, సీనియర్ నేతలు కంగుతిన్నారు. వైసీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వైఖరిపై ఆగ్రహంతో నియోజకవర్గంలో ఆయన పని తీరుపై సర్వే చేయించిందని టాక్ లేకపోలేదు. అటు పాత పట్నం ఎమ్మెల్యేపై ఎలా ఓవర్గం తిరుగుబాటు చేశారో ఎచ్చె ర్లలో కూడ అదే విధంగా రోడ్డెక్కడంతో ఆయా ఎమ్మెల్యేలలోనే కాకుండా అధికార పార్టీ నేతల్లో కూడ చర్చనీయాంశమైంది. ఇంటా, బయటా అసమ్మతితో ఇబ్బంది పడుతున్న ఎమ్మెల్యేలు, గొర్లె కిరణ్, రెడ్డి శాంతిలకు అభద్రతా భావం మొదలైందని చెప్పక తప్పదు. కొంతమంది ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, పార్టీ పదవులలో కొనసాగుతున్న వారే నేరుగా ఢీ కొట్టేందుకు సై అంటున్నారు. ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తుండడంతో రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింత తీవ్రతరంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ పై సొంత పార్టీలోనే అసమ్మతి వెల్లువెత్తింది. ఎమ్మెల్యే మాకొద్దంటూ అసమ్మతి నాయకు ఆదివారం రోడ్డెక్కారు. జగన్ ముద్దు.. ఎమ్మెల్యే వద్దంటూ గొర్లె కిరణ్ కి వ్యతిరేకంగా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వరకు హైవే మీదుగా కొనసాగింది. జగన్ రావాలి.. కిరణ్ పోవాలి, జగన్ ముద్దు.. కిరణ్ వద్దు, టిక్కెట్ కిరణ్‌కు వద్దు.. వేరే ఎవరికైనా సై.. అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది. ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను అసమ్మతివాదులు పట్టుకుని ర్యాలీలో ముందుకుసాగారు. అవినీతి ఎమ్మెల్యేను రానున్న ఎన్నికల్లో గద్దె దింపుతామని సీనియర్ నాయకులతో పాటు కొందరు సర్పంచ్ లు, ఎంపీటీసీలు హెచ్చరించారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారుఎమ్మెల్యే అయిన తరువాత ఆయన వ్యక్తిగత ప్రయోజనాలకు పాటుపడుతున్నారే తప్ప పార్టీ అభివృద్ధికి శ్రమించడం లేదన్నారు. ఆయన తీరుతో సీఎం జగన్మోహన్ రెడ్డికి మచ్చ మిగులుతుందన్నారు. పార్టీకి నష్టం చేస్తుండడంతో ఇక భరించలేక రోడ్కెక్కామన్నారు. వలంటీర్లను పెడితే అక్కడ కూడ అడ్డుకున్నారని, తన ఇంటి పేరు ఉందని ముగ్గురిని తీసేశారన్నారు. ఈ విషయం మంత్రి సత్తిబాబు దృష్టిలో పెట్టామని తెలిపారు. ఆయన జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని కాదంటే ఎట్టి పరిస్థితిలో ఆయన వద్ద ఊడిగం చేయలేమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ను వ్యతిరేకిస్తూ ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరం వైపు వస్తున్న బైక్ ర్యాలీని ఎచ్చెర్ల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం నిర్వహించే ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ అక్కడ ఎస్ఐ హైవేపై అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని వైసీపీ సీనియర్ నేతలు బల్లాడ జనార్థన్ రెడ్డి, శంకర్ పోలీసులకు వివరించినప్పటికీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే కొందరు బైక్ లపై నగరంలోకి జారుకున్నారు. శ్రీకాకుళం నగరంలో ఎవరూ అడ్డుకోకపోవడంతో పీఎన్ కాలనీ సమీపంలో గల పంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కిరణ్ పై తిరుగు బాటు సమావేశం యథావిధిగా నిర్వహించారు.

# విద్యా విధానంతోనే ముందడుగు




దేశంలో జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయి లో ఎస్‌సిఆర్‌టి ఉన్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి, వారి తరగతిని బట్టి సబ్జెక్టు లో అనుభవం కలిగిన, నిష్ణాతులైన వారి చేత పాఠ్య పుస్తకాలను రూపొందించి జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి పుస్తకాలను ఒకటి నుండి 10వ తరగతి వరకు అమలు చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా పాఠశాల స్థాయిలో పుస్తకాలను రూపొందించి తమ స్వీయ ఎజెండా అమ లు చేస్తున్నారు. 10వ తరగతిలో పబ్లిక్ ఎగ్జామ్స్ ఉన్నందున అనేక ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను చదివించకుండా కేవలం ప్రశ్న జవాబులను మాత్రమే చదివిస్తూ విద్యార్థులకు మంచి గ్రేడింగ్ రావడానికి ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులకు మార్కులు, గ్రేడింగ్ విధానంపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలోని విద్యా విధానంలో వివిధ మేనేజ్‌మెంట్లు ఉండడం వల్ల విద్యా విధానం గందరగోళంగా మారుతున్నది. దేశ వ్యాప్తంగా కామన్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. దేశ వ్యాప్తంగా ఒకేసారి పరీక్షలు నిర్వహించడం, ఒకేసారి ఫలితాలు ప్రకటించడం, ఒకేసారి ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుత విద్యా విధానంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఎయిడెడ్, కార్పొరేట్, మైనారిటీస్, మోడల్ స్కూల్, పబ్లిక్ స్కూల్‌లు, నవోదయ స్కూళ్ళు, కేంద్రీయ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఎస్‌సి గురుకులాలు, ఎస్‌టి గురుకులాలు, బిసి గురుకులాలు, తెలంగాణ రాష్ట్ర గురుకులాలు, స్పోర్ట్ స్కూల్‌లు, మిలిట్రీ స్కూల్, సైనిక్ స్కూల్‌లు, ప్రైవేటు స్కూల్‌లు, అనేకం ఉన్నాయి. భారతీయ విద్యా విధానంలో త్రి భాషా సూత్రాన్ని అమలు చేస్తున్నారు. ప్రథమ భాషగా మాతృభాష, ద్వితీయ భాషగా హిందీ, తృతీయ భాషగా ఇంగ్లీష్ అనేక పాఠశాలల్లో త్రి భాషా సూత్రం పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాతృభాష తెలుగును తప్పని సరిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. 10వ తరగతి వరకు తెలుగును తప్పని సరిగా అభ్యసించాలనే నియమ నిబంధనలు రూపొందించినది. అనేక పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వులను ఏమాత్రం ఖాతరు చేయకుండా 10వ తరగతి వరకు తెలుగు చదవకుండానే పదవ తరగతి పూర్తి చేస్తున్నారు. తెలుగుకు బదులుగా సంస్కృతం, రష్యన్, ఫ్రెంచ్, చైనీస్ మిగతా భాషలను చదువుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో 10వ తరగతి వరకు తెలుగు భాషను అమలు చేయని పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్త ధోరణి, అవినీతి వలన ప్రైవేటు పాఠశాలల్లో ఆడిందే ఆటగా మారింది. జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి ఉన్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి, వారి తరగతిని బట్టి సబ్జెక్టులో అనుభవం కలిగిన, నిష్ణాతులైన వారి చేత పాఠ్య పుస్తకాలను రూపొందించి జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి పుస్తకాలను ఒకటి నుండి 10వ తరగతి వరకు అమలు చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా పాఠశాల స్థాయిలో పుస్తకాలను రూపొందించి తమ స్వీయ ఎజెండా అమలు చేస్తున్నారు. 10వ తరగతిలో పబ్లిక్ ఎగ్జామ్స్ ఉన్నందున అనేక ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను చదివించకుండా కేవలం ప్రశ్న జవాబులను మాత్రమే చదివిస్తూ విద్యార్థులకు మంచి గ్రేడింగ్ రావడానికి ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులకు మార్కులు, గ్రేడింగ్ విధానంపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. విద్యార్థుల మానసిక, భౌతిక విషయాలపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. 10వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ తరువాత ఇంటర్మీడియట్, ఆ తర్వాత జరగనున్న ఐఐటి కోసం 3, 4వ తరగతి నుండే ఐఐటి బోధన పేరిట విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు.పబ్లిక్ స్కూళ్లలో, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ఫీజులను తమకు ఇష్టానుసారం పెంచుకుంటుపోతున్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఫీజుల భారం ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో ఫీజులను ఖరారు చేసింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా అధిక మొత్తాల్లో ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు.

విద్య వ్యాపార సంస్థగా మారింది. జాతీయలో, రాష్ట్ర స్థాయిల్లో అధికారులు పిల్లలు, నాయకుల పిల్లలు, పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు చదవడానికి కామన్ విద్యా విధానంను అమలు చేయాలి. జాతీయ స్థాయిలో కేంద్ర కేబినెట్ 2023-24 విద్యా సంవత్సరానికి ఆమోదించిన 1+5+ 3+4 విద్యా విధానం అన్ని పాఠశాలల్లో అమలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ టీచర్‌లు, ఎయిడెడ్ టీచర్లు, ప్రైవేటు టీచర్‌లు, విద్యా వాలంటీర్లు, కాంట్రాక్టు టీచర్లు, గురుకుల పాఠశాలల టీచర్లు, మోడల్ స్కూల్ టీచర్‌లు అంటూ వేరువేరు పేర్లతో పిలుస్తున్నారు. ఉపాధ్యాయుల కనీస సమస్యలను పరిష్కరించడం లేదు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సర్వీస్ నిబంధనలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా సంబంధిత అధికారులు జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కామన్ విద్యా విధానంపై దృష్టిని కేంద్రీకరించి విద్యా వ్యాపారంను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జూన్ 30వరకు ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో మార్పులు



తిరుమల, మే 23, :తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30 వరకు ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో మార్పులు చేసినట్లు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. సర్వదర్శనానికి సుమారు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. దీంతో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం ఆర్జితసేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. కోవిడ్ ముప్పు పూర్తిగా తొలగిపోవడం, వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్యభక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామివారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్టు టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేసినట్లు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. దీంతో 20 నిమిషాల సమయం ఆదా అవుతుందన్నారు. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుందని తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదని స్పష్టం చేశారు. కేవలం స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని తెలిపారు. దీని వల్ల ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుందన్నారు. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం అవుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు, వీఐపీలు సహకరించాలని టీటీడీ ఛైర్మన్ వైవీ. సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.టీటీడీ శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్ చెప్పింది. జులై, ఆగస్టు నెలల కోటా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఈనెల 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ టికెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. ప్రతి నెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల లక్కీ డిప్ కోసం భక్తులు నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు లక్కీ డిప్ లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. తిరుమల శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, గదుల కోటా వంటి టికెట్లు కోసం భక్తులు ఎదురు చూడాల్సిన పనిలేకుండా, ఇకపై ప్రతి నెలా నిర్ణీత తేదీల్లోనే తర్వాతి నెలలకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్ లో విడుదల చేయనున్నట్లు టీటీటీ తెలిపింది.

## నేడు అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవం

మే 24వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈరోజు అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవం. ప్రతి సంవత్సరం ఫాదర్స్, మదర్స్ డే, లవర్స్ డే మాదిరి బ్రదర్స్ డే ను ప్రపంచ దేశాలు నిర్వహించుకుంటున్నాయి. సోదరుడు అంటే అన్నాతమ్ముడు ఎవరైనా కావొచ్చు. మనతో ఆత్మీయంగా స్నేహితుడి మాదిరి ఉండే వ్యక్తి సోదరుడు. సోదరులు ఉంటే రక్త సంబంధమే కాదు. మనతో ఆత్మీయంగా ఉండే స్నేహితులను కూడా సోదరులుగా భావించవచ్చు. వారికి కూడా విషెస్ చెప్పొచ్చు. అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 24న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మరియు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో అంతర్జాతీయ బ్రదర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ బ్రదర్స్ డే ఎందుకు జరుపుకుంటారు. అసలు ఎప్పుడూ ప్రారంభమైందో తెలుసుకుందామా... 2005 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం మే 24న బ్రదర్స్ డే జరుపుకుంటారు. అలబామాకు చెందిన సిరామిక్ కళాకారుడు, శిల్పి, రచయిత సి డేనియల్ రోడ్స్ మొదటగా ఈ రోజును జరుపుకోవడం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10న జరుపుకునే నేషనల్ సిబ్లింగ్స్ డే దినోత్సవం మాదిరిగానే ప్రతి సంవత్సరం మే 24న బ్రదర్స్ డే జరుపుకుంటారు. అయితే మొదట్లో దీనిని కేవలం అమెరికాలో మాత్రమే జరుపుకునేవారు. తర్వాత ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా ఈరోజును జరుపుకోవడం ప్రారంభించాయి. కొన్ని దేశాలలో ఈరోజున అధికారిక సెలవు దినంగా పాటిస్తారు. ఈ రోజున సోదరులు పరస్పరం బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. కొన్ని దేశాల్లో వారి సోదరులకు ఇష్టమైనవి వంటకాలు చేసి కలిసి భుజిస్తారు. అన్నాదమ్ములు పరస్పరం తమపై ప్రేమ చాటుకునేందుకు ఉద్దేశించినదే బ్రదర్స్ డే.

## విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణ కోసం ఏడు రోజుల నోటీసు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. మే 23 (ప్రజాపాలన ప్రతినిధి) విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణ మరియు దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోసం ఏడు రోజుల నోటీసు ట్రాన్సకో సి. యమ్. డి విజయానంద్ కి అందజేసిన ఇరవైఐదు యూనియన్లు మరియు అసోసియేషన్ల తో కూడిన విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ.వివరాల్లోకి వెళితే ప్రజలకి అత్యంత చేరువలో ఉండే విద్యుత్ రంగ సంస్థ గురించి గతం లో అనేక రాజకీయ పార్టీలు హామీలద్వారానే అధికారం లోకి వచ్చారు అనుటలో సందేహం లేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వ్యవసాయ విద్యుత్ వాడకం దారుల కి పగటి పూట విద్యుత్ అనే అంశాన్ని తమ మేనిఫెస్టో లో కూడా పేర్కొన్నారు. వీటిని అమలు పరిచే యంత్రాంగమే విద్యుత్ రంగ సంస్థ, దీనిలో వివిధ విభాగల్లో పనిచేసే సిబ్బంది, వీరికి సంబందించిన వేతన సవరణ ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక మారుఉంటుంది. ఐతే ముఖ్యమంత్రి వైయ స్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రెండు వేల ఇరవై రెండు ఏప్రిల్ నెల లో వేతన సవరణ అమల్లోకి తీసుకురావాలి, ఐతే రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యుత్ ఉద్యోగులవేతన సవరణ అంశం పై విశ్రాంత ఐ. ఎ. స్ అధికారి మన్మోహన్ సింగ్ ని నియమించి వారిద్వారా కొన్ని సూచనలు తీసుకోవడం తో ఇప్పటికీ వేతన సవరణ అంశం పెండింగ్ లో నే కొనసాగుతున్న తరుణం లో, వేలాది మంది ఉద్యోలుగుల కి సంబందించిన అంశం పై ట్రాన్సకో సి. యమ్. డి విజయానంద్ కి ఏడు రోజుల నోటీసు విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ విజయవాడ లో గల విద్యుత్ సౌధలో అందజేశారు.దీనిపై విద్యుత్ సంఘాలు త్వరలో నే ఈ అంశం పై ఒక నిర్ణయం తీసుకుని వేతన సవరణ అంశం ముగుస్తుంది అని ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో జె. ఎ సి చైర్మన్ పి.చంద్రశేఖర్ సెక్రటరీ జనరల్ పి. ప్రతాప్ రెడ్డి, కన్వినర్ బి. సాయి కృష్ణ, కో చైర్మన్ ఎ. శ్రీనివాస్ కుమార్ వైస్ చైర్మన్ ఎ. వి. కిరణ్, గణపతి తదితరులు ట్రాన్సకో జె. యమ్. డి. విజిలెన్స్ మల్లారెడ్డి సమక్షంలో అందజేశారు.

## వేలాదిమంది ముత్తైదువులకు కన్నుల పండుగగా సువాసిని పూజలు



విజయవాడ పశ్చిమ ప్రజా పాలన ప్రతినిధి:శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠం ప్రాంగణంలో మంగళవారం ఉదయం సువాసిని పూజలు కన్నుల పండుగగా నిర్వహించారు.శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో గతనెల 27 నుండి ఈ నెల 3 తేదీ వరకు సహస్ర చండీ యాగాలు జరిగిన విషయం తెల్సిందే. ఐతే అప్పట్లో అకాల వర్షాలు వల్ల వాయిదా పడిన సువాసిని పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయం (దేవి ఆశ్రమం) పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ తేజోమూర్తుల బాలభాస్కర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని సంప్రదాయం ప్రకారం ఈ వేడుకలకు మార్గదర్శకత్వం వహించారు. ఈ వేడుకలు కోసం నిర్మించిన ప్రత్యేక వేదికపై శ్రీ దేవీ కరుమారి అమ్మన్ ప్రతి రూపాన్ని ఏర్పాటు చేశారు. ఇదే వేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త యాబలూరి లోకనాధ్ శర్మ,విమలాదేవి దంపతులు, శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు, తేజోమూర్తుల బాల భాస్కర శర్మ లి ఆశీనులు కాగా వారంతా సువాసిని లతో తొలుత గురుపూజలు అందుకున్నారు.ఆతరువాత వరసగా శ్రీ దేవి కరుమారి అమ్మన్ పూజ, దంపతులు పూజ,బాల పూజా, కన్యలపూజా, సువాసిని పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ వేడుకలు ఎంతో మంగళ ప్రదమైనదన్నారు.కైలాసంతో ఉమా పూజలు నిర్వహించింత పుణ్యం సంతరించుకొంటుందన్నారు.. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, సీనియర్ గురు స్వామి బెవర రాము,ఎస్ ఏ ఎస్ కళాశాల కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్, శ్రీ మాతృ లలితా మండలి రథసారథి కోడూరి సుందరి,చంద్రకళ, కొండపర్తి పార్వతి, పూజారులు దీక్షితులు, కొండపర్తి వినోద్, కొండపర్తి చైతన్య తదితరులు పాల్గొన్నారు.అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం జరిగింది.

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



చీరాల, మే 23, ప్రజాపాలన : అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అధికారులు, సిబ్బంది, ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అలసత్వం వహించినా, సహించే ప్రసక్తే లేదని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి హెచ్చరించారు. చీరాల నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభి వృద్ధి పనులను పరిశీలించేందుకు, ఎమ్మెల్యే బలరామ్ విస్తృతంగా పర్యటించారు. ఎమ్మె ల్యే పర్యటనలో భాగంగా, రోశయ్య కాలనీ, సంపత్ నగర్ మూడు రోడ్ల సెంటర్, రామకృ ష్ణాపురం లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను, అక్కాయి పాలెం పంచాయతీ పరిధిలో, లక్ష్మీపురంలో స్మశాన వాటిక ప్రహరీ గోడ, స్వామి వివేకా నంద కాలనీలో, మంచి నీటి పైపులైన్ల అభివృద్ధి పనులను, పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, త్వరిత గతిన పనులను పూర్తి చేయాలని, అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే బలరామ్ వెంట చీరాల, వేటపాలెం మండలం ఎంపీడీఓ లు నేతాజీ, శర్మ, ఆర్.డబ్ల్యూ. ఎస్.డి. ఇ , చుండూరు వాసు, లేళ్ల శ్రీధర్, జంగిలి రామారావు, మంతు, అందే కృష్ణ, కర్ణ లక్ష్మణరావు, కర్ణ కృష్ణ మోహన్, కట్టా దాసు, సెక్రెటరీలు శ్రీనివాసులు,శివ లీల,తదితర అధికారులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ మోహన్ రెడ్డి చారిత్రాత్మక విజయానికి నాలుగేళ్లు: ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రా వు



వీరులపాడు మే 23 ప్రజా పాలన ప్రతినిధి మండలం లోని వి.అన్నవరం గ్రామంలో గడపగడపకు మన ప్ర భుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారంశాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు

ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ – ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డు తూ ప్రజల ఆశీర్వాదంతో 2019,మే,23 న ఎన్నికల సంఘం ప్రకటించిన ఫలితాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టి, చంద్ర బాబు దుర్మార్గపు పాలనకు ముగింపు పలికారన్నా రు. ఎన్నికల మేనిఫెస్టో కు సరికొత్త నిర్వచనం ఇచ్చే లా 98.5 శాతం హామీలను వైయస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. అర్హతే ప్రామాణికం గా, వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి.వా లంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకువెళ్లారని గుర్తు చేశారు. అ లాగే జిల్లాలను పునర్వ్యవస్థీకరించి.26 జిల్లాలను ఏ ర్పాటు చేసి పరిపాలన వికేంద్రీకరించారని, సంస్కరణ ల ద్వారా విప్లవాత్మకమైన మార్పులతో సుపరిపాలన అందిస్తూ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా సీఎం వైయ స్ జగన్ నిలిపారని కొనియాడారు. 47 నెలలో సంక్షే మ పథకాల ద్వారా డిబీటి (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.10 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతా ల్లో జమ చేసిన దాఖలాలు దేశంలో మరెక్కడా లేవ న్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి ము త్తారెడ్డి, జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్ట ర్ షహనాజ్ బేగం, గ్రామ సర్పంచ్ జమ్ముల వరబా బు, జమ్ముల శేషగిరిరావు, ఎంపీటీసీ తోట నారాయ ణ, దొడ్డదేవరపాడు సర్పంచ్ చెంద్యాల రామకృష్ణ, సొ సైటీ అధ్యక్షులు జమ్ముల వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బేతు రాంబాబు తదితరులు పాల్గొ న్నారు

# చెల్లికి మళ్లీ పెళ్లా..?

### జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ



మచిలీపట్నం టౌన్ మే 23 ప్రజాపాలన : బందరు పోర్టు పనులు అనే కట్టుకథలు, చెల్లికి మళ్లీ పెళ్లి అన్నట్టుగా ఉందని, బందరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ బండి రామకృష్ణ అన్నారు.మంగళవారం బందరు నియోజక వర్గ జన సేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు 8 నెలల ముందు మీరు చెప్పే అబద్ధపు, మోసపూరిత మాటలు జనం నమ్మే స్థితిలో లేరన్నారు. రాజశేఖర రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, పోర్టుకు, శంకుస్థాపనలు చేశారని అన్నారు.ఆ తర్వాత చంద్ర బాబు నాయుడు శంకుస్థాపన చేసి , పనుల ప్రారంభానికి నవయుగ సంస్థ కి అప్పగిస్తే, వాళ్ళని వెనక్కి పంపిన మాట వాస్తవం కాదా అని రామ కృష్ణ అన్నారు. ముందు బందరు నగరం, పరిసర ప్రాంతాల అభివృద్ధి పై దృష్టి పెట్టండని అన్నారు. కోనేరు సెంటర్, మూడు స్తంభాల వైపు సరైన రోడ్డు ఏదన్నారు. డ్రైనేజీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు.ఎంతో ఘన చరిత్ర కలిగిన బందరు టౌన్ హాల్ అభివృద్ధి ఏదని, హిందూ కళాశాల, నోబుల్, ఆంధ్ర జాతీయ కళాశాలల అభివృద్ధి మాటేమిటి? అని ప్రశ్నించారు. స్లం ఏరియా లో కృష్ణా యూనివర్సిటీ నా ? అని అన్నారు.చిన్నాపురం, ఉల్లిపాలెం రోడ్డంతా గతుకుల మయం అని, కోడూరు రహదారి గుంతలమయం అని, అన్నారు. ఏది ఏమైనా వై.సి.పి. నాయకులు మాట్లాడే మాటల్లో నిజాయితీ, నిబద్ధత ఉండాలన్నారు.అప్పుల మయమైన రాష్ట్రంలో కంపెనీ లు, అభివృద్ధి అనడం, హాస్యాస్పదంగా ఉందన్నారు. మణిహారం లాంటి విజయవాడ రోడ్డు వైపు కానీ , పెడన రోడ్డు లో కానీ, ఫ్లైఓవర్ వేయాలి కానీ పనికిరాని ప్రదేశాల్లో ఫ్లై ఓవర్లు ఎందుకన్నారు. సంపాదన పెంచుకోడానికి రాజకీయాలు చేయడం మానండి అని అన్నారు.ఏనాడైనా కట్టుబట్టలతో నిరాశ్రయులైన వారికి, నిలువ నీడ లేని వారికి సాయం చేశారా? అని ప్రశ్నించారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రజలు వేరే ప్రాంతాలకు వలసలు వెళ్ళడం వాస్తవం కాదా అని అన్నారు. శవాల మీద డబ్బులు ఏరుకోకూడదన్నారు. రాబోయే ఎన్నికలకు సమాయత్తం అవుతున్నామని, ఆరు నెలల ముందే పటిష్టంగా కమిటీ లు వేసి ప్రణాళికలు రూపొందిస్తున్నామని,వై.సి.పి. ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని బండి రామ కృష్ణ తీవ్ర స్వరంతో అన్నారు. ఈ కార్యక్రమంలో బందరు నగర జన సేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు, ఉపాధ్యక్షులు, వంపుగడపల చౌదరి, పెద యాదర సర్పంచ్ గల్లా తిమోతి , పినిశెట్టి రాజా,పెద్దయెత్తున జన సైనికులు పాల్గొన్నారు.

## ఏపీకి అధోగతి పట్టి నాలుగేళ్లు పూర్తయింది: టి.డి.పి.శ్రేణులు వినూత్న నిరసన

మచిలీపట్నం టౌన్ మే 23 ప్రజాపాలన :రాష్ట్రంలో పెరిగిన కరెంటు కోతలు మరియు విద్యుత్ చార్జీల




పెంపును నిరసిస్తూ మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గొడుగు పేట సబ్ స్టేషన్ ముందు మంగళవారం టిడిపి నేతలు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా టి.డి.పి.కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి, ఏపీకి అధోగతి పట్టి నేటికి 4 ఏళ్ల పూర్తి అయ్యిందని, విద్యుత్ చార్జీలు పెరగవని ప్రమాణస్వీకార సమయంలో జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమయ్యింది ? అని ప్రశ్నించారు.4 ఏళ్లలో 7 సార్లు చార్జీలు పెంచి 57 వేల కోట్ల రూపాయల భారం వేశారనారు.ఎప్పుడూ లేని విధంగా ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై పెను భారం మోపారన్నారు. ప్రతీ నెలా డిస్కమ్?లకు చార్జీలు పెంచుకునేలా అనుమతి ఇవ్వడం ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఎన్నడూ లేని విధంగా కరెంటు కోతలు విధిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళు ్ళ తెరిచి కోతలేని కరెంటు ఇవ్వాలని విద్యుత్ కొనుగోళ్ళ అవినీతిపైన, ఒప్పందాల పైన విచారణ జరిపించాలని , పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. మోటార్లకు పెడుతున్న మీటర్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, పంచ పర్వాల కాశీ విశ్వనాథ్, కట్టా అంజిబాబు, రాజులపాటి నాగబాబు, అక్కు మహంతి రాజా, లంకే శేషగిరిరావు, మరకాన్ని పరబ్రహ్మం, టి.డి.పి. నాయకులు పివి ఫణి కుమార్, లోగిశెట్టి స్వామి, లంకి శెట్టి నీరజ, ఆళ్ళ మాధవ , తిరుమాణి నారాయణ, గోకుల్ శివ , జిజ్జవరపు అంజిబాబు, బందారు నాని, చిన్నం శివ, భూపతి త్రిపుర, బడుగు ఉమాదేవి, ఈడే దాసు, బడే రమణ, సుబ్బారావు, కట్ట దుర్గ, నాగమ్మ , శ్రీదేవి,లంకే హరి మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఇన్నోవేషన్ కాంపిటీషన్ ఇన్ ఈస్ట్ ఏషియా కాంపిటేషన్‌లో తెలుగుతేజం ప్రతిభ



రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన యన్.ఇర్.ఐ. పోపూరి.శ్రీనివాసరావు "ఇన్నోవేషన్ కాంపిటేషన్ ఇన్ ఈస్ట్ ఏషియా" కాంపిటేషన్ లో పాల్గొని అంతర్జాతీయ వేదికపై 3%తీ౨% బహూమతి పోందారు.అంతర్జాతీయ ఇన్నోవేషన్ కాంపిటేషన్ లో అమెరికా, నార్వే, తైవాన్, థాయిలాండ్ లతోపాటు అనేక ఈస్ట్ ఏషియా దేశాలు పాల్గొన్న వేదిక పై పోపూరి. శ్రీనివాసరావు గ్రామీణ ప్రాంతం నుండి స్వయంకృషితో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి అత్యున్నత ప్రతిభ కనపర్చారు. ప్రపంచ స్దాయితో భారతదేశ కీర్తి ప్రతిష్ట లను ఇముడింపచేసిన గణపవరం గ్రామ వాసి పోపూరి. శ్రీనివాసరావు కు పలుపురు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ కోతలు, విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: విద్యుత్ కోతలకు మరియు విద్యుత్ చార్జీల పెంపు మీద రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు లాంతర్లతో సత్తెనపల్లి సబ్ స్టేషన్ దగ్గర నిరసన కార్యక్రమం నిరవహించిన సత్తెనపల్లి నియోజకవర్గ నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (మల్లి బాబు)లి మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు మల్లిబాబు మాట్లాడుతూ ఇప్పటికి 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని,స్మార్ట్ మీటర్ల వ్యవహారం లో 7,000 కోట్ల స్కాం ఉందని, ఇప్పటికే 57,000 కోట్లు ప్రజలపై అదనపు భారం మోపారన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల సాంబయ్య, సత్తెనపల్లి టౌన్ పార్టీ అధ్యక్షులు కటకం రామకృష్ణ, సత్తెనపల్లి రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు,పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బత్తుల చంద్రశేఖర్, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధివక్కంటి అజయ్ కుమార్,క్లస్టర్ ఇంచార్జిలు పొట్ల ఆంజనేయులు,మార్కెట్ రాజు, డాక్టర్. వడ్డె%శీ%పూడిపవన్ కుమార్, పచ్చ సుధీర్, గన్నమనేని శ్రీనివాసరావు,నూర్ భాషా జానీ బాబు,నాగం కార్తీక్, దివ్వల శ్రీనివాసరావు, జింక లోకేశ్వరరావు, సర్వేపల్లి వెంకట్రావు, మారేళ్ళ స్వామి,గుత్తా రామారావు,పిల్ల సాంబశివరావు,నువ్వుల రమణ,గింజుపల్లి సాయి,చిమట అనిల్ యాదవ్, పొట్ల వెంకటేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూనిట్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

## సన్మాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



మచిలీపట్నం కలెక్టరేట్ మే 23 ప్రజాపాలన జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, అత్యుత్తమ పనితీరు కనబరిచిన వాలంటీర్లను సన్మానించే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులు ఆదేశించారు.మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ అపరాజిత సింగ్ డి ఆర్ వో యంవెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన, జగనన్నఆణిముత్యాలు, వాలంటీర్లకు వందనం, మిషన్ లైఫ్, గృహ నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకార్యక్రమాన్ని కింది స్థాయి నుండి పై స్థాయి వరకు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ కూడా ఎంతోఅంకితభావంతో కృషిచేసి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విజయవంతం చేశారని, అందులకు అందరినిఅభినందిస్తున్నానన్నారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను సురక్షితంగా వారిగమ్యస్థానాలకు చేర్చడం చాలా గొప్ప విషయం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద పదవ తరగతి, ఇంటర్‌పరీక్షల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఈనెల 25వ తేదీన నియోజకవర్గస్థాయిలో, ఈనెల 27వ తేదీన జిల్లా స్థాయిలో సన్మానించడానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు.అలాగే వాలంటీర్లకు వందనం కార్యక్రమం కింద అత్యుత్తమ పనితీరు కనపరచిన వాలంటీర్లను కూడాసత్కరించేందుకు ఏర్పాటు చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు.పర్యావరణాన్ని పెంపొందించే దిశగా వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పలు పోటీలను నిర్వహించి ప్రజల్లోచైతన్యం తీసుకురావాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు.ఈ వారం అంతా గృహ నిర్మాణ వారోత్సవాలుగా పరిగణించాలని ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలఅధికారులను భాగస్వాములు చేస్తామన్నారు.ఈ టెలికాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ గ్రామం చుట్టుపక్కల మండలాలకే కాకుండా ఆ జిల్లాకే ఒక ఆదర్శం




తిరుపతి జిల్లా, పాకాల మండలం, ప్రజాపాలన ప్రతినిధి: పాకాల పట్టణానికి ఆనుకొని ఉన్న తలారి పల్లి గ్రామం ఒకప్పుడు, ఇప్పుడు ఆ మండలానికి, ఆ జిల్లాకి ఆదర్శం, చిత్తూరు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా తలారి పల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ జిల్లాకే కాకుండా చుట్టుపక్క మండలాలకు ఆదర్శంగా నిలిచిన ఆ గ్రామం, ప్రస్తుతము ఆ గ్రామంలో ఎంతోమంది బాగా చదువుకొన్న వాళ్ళు ఉన్నారు. పెద్ద పెద్ద ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నటువంటి వాళ్ళు ఉన్నారు. ఆ ఊరిలో ప్రస్తుతం కొన్ని సంవత్సరాల నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం విరిగిన చేయితో విగ్రహం చుట్టూ చెత్తతో కొంత భాగం విగ్రహం పూడిపోయి ఉన్నది. దానిని బాగు చేయడానికి ఇంతవరకు ఆ గ్రామంలోఎవరు ముందుకు రాలేని దుస్తుతి నెలకోని ఉన్నది. ఇప్పటికైనా గ్రామస్తులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు చదువుకున్నవాళ్లు మేల్కొని పాత విగ్రహం ఉన్న స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## అనారోగ్యంతో మరణించిన వుటుకూరి శివయ్య కుటుంబానికి చిన్నగార్లపాడు వైయస్సార్ సిపి నాయకులు ఆర్థిక సహాయం



కారంపూడి...మే23...ప్రజాపాలన... ప్రతినిధి...మండలంలోని చిన్న గార్లపాడు ఎస్సీ కాలనీ లో వైఎస్ఆర్సిపి కార్యకర్త వుటుకూరు శివయ్య అనారోగ్యంతో మరణించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి భార్య సైదమ్మ కు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ పార్టీ సీనియర్ నాయకులు అనుపు రెడ్డి పుల్లారెడ్డి వాసు రెడ్డి సర్పంచ్ బద్దూరి శ్రీనివాసరెడ్డి ఎంపీటీసీ డేవిడ్ మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు భూషణం కిరణ్ కుమార్ ఎస్సీ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు ప్రతిరోజు క్రమం తప్పకుండా చిన్నారులతో వ్యాయామం చేయించాలి: కారంపూడి తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్



కారంపూడి.. మే23...ప్రజాపాలన... ప్రతినిధి.. :పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగనవాడి కేంద్రాలలో వ్యాయమ సైకిల్లను మంగళవారం తహసీల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమం స్థానిక వినుకొండ రోడ్డులోని అంగనవాడి కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అంగనవాడి కేంద్రాలలో వయస్సుకి తగ్గ ఎత్తులేని పిల్లలు ప్రతిరోజు క్రమం తప్పకుండ యాక్టివిటీలు చేయించాలానే ఉద్దేశంతో అంగనవాడి కేంద్రాలకు వ్యాయమ సైకిల్ లను అందించటం జరిగిందని అయన అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా వయస్సుకి తగ్గ ఎత్తు లేని పిల్లలు అధికంగా ఉన్న అంగనవాడి కేంద్రాలకు ఈ సైకిల్ లను అందించటం జరిగిందని అంగనవాడి టీచర్లు ప్రతిరోజు క్రమం తప్పకుండ చిన్నారులతో వ్యాయామం చేయించాలని. దీనికి సంబంధించి ప్రతినెల రిపోర్ట్ ను కూడ తమకు అందించాలని అంగనవాడి కార్యకర్తలను ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు. ఈ సందర్భంగా అంగనవాడి కేంద్రాలలో స్టాక్ ను అయన పరిశీలించారు అనంతరం బాలామృతం, కోడిగుడ్లు, పాలు లబ్ధిదారులకు పంపిణి చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గురజాల సిడిపిఓ షేక్. రుక్సానా సుల్తానా బేగం, సూపెర్వైజెర్ అనంతలక్ష్మి, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్నా మీ మానస పుత్రిక అయిన సచివాలయం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

## ఎఐటియుసి పల్నాడుజిల్లా ప్రధాన కార్యదర్శ కాసా రాంబాబు డిమాండ్




పల్నాడు జిల్లా .నరసరావుపేట .మే 23. (ప్రజాపాలన ప్రతినిధి): జగనన్న మీ మానస పుత్రిక అయిన గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న శానిటేషన్ %డ% ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని లేని పక్షంలో ఎఐటియుసి వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కాసారాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మున్సిపాల్ కమీషనర్ల దగ్గర నుంచి సానిటరీ ఇన్స్పెక్టర్ లు వరకు గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల పై జరుగుతున్న వేధింపులు ఆపకపోతే తీవ్రమైన పరిణామాలు తప్పవని ద్వజమెత్తారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సెలవులు జి. ఓ. ను అమలు చేయకుండా ఉద్యోగుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. రోజుకు 10 నుంచి 14 గంటలు పని చేయిస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ వారితో చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. జగనన్న మానసపుత్రిక యొక్క ఉద్దేశ్యంను నిర్వీర్యం చేస్తున్నారని ద్వజమెత్తారు. ఉద్యోగుల్లో ఉన్న మహిళలు, గర్భిణులు అని కూడా చూడకుండా సమయపాలన అమలు చేయకుండా సస్పెండ్ ల పేరుతో హింసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాబట్టి అట్టి అధికారుల పై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అన్నారు. రాజకీయ నిర్ణయం అయినటువంటి చెత్త సేకరణ పన్ను పై ప్రజలు వ్యతిరేకంగా ఉన్న తరుణంలో ప్రజలు పన్ను కట్టకపోతే సెక్రటరీలను మీ జీతంలో నుండి కట్టాలని వేధించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వీళ్లకు సంబంధం లేని పారిశుధ్య పనులను వీరికి అన్వయించి పారిశుధ్య పనులకు మీరే బాధ్యులు అని సెక్రటరీలను కేవలం మేస్త్రిలుగా పనులు చేయించడం ఎంతవరకు సబబు అని ఆలోచన చేయాలన్నారు. వీళ్ళ జాబ్ చార్ట్ ను అమలు చేయకుండా వేదిస్తున్న అధికారుల పై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని కోరుతున్నామన్నారు. అలాగే వీళ్లకు టెక్నికల్ సర్వీసెస్ అయిన జనన -మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఎన్విరాన్మెంట్ విధులు అయినా ప్లాస్టిక్ నియంత్రణ, ఫుడ్ సేఫ్టీ చెకింగ్ విధులు వీరికి వెంటనే ఇచ్చి వారి ఆత్మ గౌరవంను కాపాడాలని కోరారు. వార్డు శానిటేషన్ %డ% ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు జి. ఓ నెంబర్ 650 ప్రకారం సచివాలయం ఉద్యోగులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు మాత్రమే సమయపాలన అనే జీవో ని అమలు చేయాలని. జూన్ 1 నుండి సచివాలయం సమయపాలన పాటిస్తారని కమీషనర్ లు సస్పెండ్ చేస్తామని వేధింపులకి పాల్పడినా, వారిని సస్పెండ్ చేసినా కమిషనర్ ల పై న్యాయపోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. సి.డి.ఎమ్.ఏ ఇచ్చిన సెలవుల ఉత్తర్వులు అన్ని మున్సిపాలిటీలలో తూచాతప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ సర్వీసెస్ అయిన జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఎన్. ఓ. సి సర్టిఫికెట్ జారీ అధికారం, మ్యారేజ్ సర్టిఫికెట్, ట్రేడ్ లైసెన్స్ జారీ అధికారం వీరికి అప్పగించాలని డిమాండ్ చేశారు. మహిళా సెక్రటరీ ల పై వేధింపులు ఆపాలని బేషరతుగా ఇప్పటి వరకు ఇచ్చిన సస్పెండ్ ఉత్తర్వులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చెత్త పన్ను విషయంలో వేధింపులు ఆపి చెత్త పన్ను నుండి విముక్తి కలిగించాలని కోరారు. సానిటరీ ఇన్స్పెక్టర్ లను రిపోర్టింగ్ ఆఫీసర్లు గా తొలగించి ఆ బాధ్యతలు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ లేదా కమీషనర్ లను రిపోర్టింగ్ ఆఫీసర్ గా పెట్టాలని సూచించారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆంధ్ర ప్రదేశ్ శానిటరీ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య నేతృత్వంలో సచివాలయ ఉద్యోగులందరినీ ఐక్యం చేసి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఏ ఐ టి యు సి అధ్యక్ష కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య వైదన వెంకట్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## వినుకొండ మాలమహానాడు పట్టణ కమిటిని నియమించిన నియోజకవర్గ ఇన్చార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు



పల్నాడు జిల్లా. వినుకొండ .మే 23.( ప్రజా పాలన ప్రతినిధి): వినుకొండ మాలమహానాడు పట్టణ కమిటి ని నియమించిన నియోజకవర్గ ఇన్చార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు.మంగళ వారం వినుకొండ పట్టణంలోని వినుకొండ నియోజకవర్గ కార్యాలయంలో వినుకొండ పట్టణ కమిటీలు ఎన్నుకోవడం జరిగింది . ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ కీర్తిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో మాలల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేయడానికి ఈ కమిటీలు దోహద పడతాయని పట్టణంలోని ప్రతి వార్డులో నీ విద్యార్థులు మహిళలు ఉద్యోగుల అంతా ఏకమై భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని ఏ రాజకీయ పార్టీ అయినా మాలలను విస్మరించకుండా ఉండాలని అలా వ్యవహరించిన రాజకీయ పార్టీలకు బాబా సాహెబ్ ఆలోచన విధానంతో నూతనంగా ఎన్నుకున్న కమిటీలు పనిచేస్తాయని తెలియజేశారు.ఈరోజు నూతనంగా ఎన్నుకోబడిన వినుకొండ పట్టణ ఉపాధ్యక్షులుగా జ్యోతి మల్లికార్జునరావు సెక్రటరీగా జంగా నాసరయ్య జనరల్ సెక్రెటరీగా బేతం బాలకృష్ణ ట్రెజరర్ గా గుర్రాల సుబ్బారావు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు కోండ్రు విజయ్,నియోజక వర్కింగ్ అధ్యక్షులు గుడిపూడి ఏసురత్నం ,గౌరవ అధ్యక్షులు కొమ్మతోటి కృపయ్య , దార్ల ఎర్రయ్య, పట్టణ అధ్యక్షులు బేతం దేవానంద్ యూత్ అధ్యక్షులు కీర్తిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించిన బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 23:విశాఖపట్టణం ఆనందపురం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించిన బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్.ఆనందపురం మండలంలో పాలవలస ఎర్ర చేరువు, నేలతెరు ఈతల చేరువు, దగ్గర మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం.పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా (%చీ=జు+ూ%) వందమంది వ్యవసాయ కూలీలతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం.కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పని కల్పించడమే ఈ పథకం యొక్క లక్ష్యం మనీ, గ్రామీణ ప్రాంతాలు వారు,వలసలు వెళ్ళకూడదని,ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం అని, ఆనందపురం మండలంలో ఈ పథకం బాగా అమలు జరుగుతుందని,వ్యవసాయ కూలీలు,గుర్తించి ఆనందపరం మండలం తో పాటు ఉచితంగా భీమిలి నియోజకవర్గం లో పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మికులుకు ఈ- శ్రమ్ కార్డులు కూడ నమోదు చేయడం జరిగిందని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు జరుపుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి, ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, బిజేపి కిసాన్ మెర్చా మండల నాయకులు,బంక సీతం నాయుడు, మల్లరాపు కృష్ణ,పాల్గొన్నారు.

## నయ వంచన పాలనకు చరమగీతం పాడి నాలుగేళ్లు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట మే 23 ప్రజా పాలన ప్రతినిధి: వైసీపీ పా ర్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి ఐన సంద ర్భంగా ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఒక ప్ర కటనలో మాట్లాడుతూనయవంచన పాలనకు చరమగీతం పాడి,సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టి 175 స్థానాలకు గాను 151 యొక్క స్థానాలు సాధించిన చారిత్రాత్మక ఘట్టానికి నాలుగేళ్లు పూర్తయినదన్నారు ఈసందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ఉదయభాను హృదయపూర్వక శుభాకాంక్షలు తె లియజేశారు పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలో నే 175/151 స్థానాలు సాధించి చరిత్ర సృష్టించి దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేసిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు జైజైలు పలుకు తు న్నారని మరొకసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజ లు ఉవ్విల్లురుతున్నారు అని అన్నారు.జగ్గయ్యపేట నియోజకవర్గంలో తనను గెలిపించేందుకు అహర్నిశలుకృషిచేసినపార్టీకార్యకర్తలకు,నాయకులకు,అభిమానులకు నియోజకవర్గ ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## భూషణ్ పురస్కారం అవార్డ్ అందుకున్న డాక్టర్ యం యస్ స్వరూప్ నీ స్వాగతించిన పాలు స్వచ్ఛంద సంస్థలు



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 23: మధురవాడ పీ యం పాలెం కు చెందిన ఎబి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. యం.యస్ స్వరూప్ గారి సేవకు గాను వరించిన అరుదైన బుషన్ పురస్కారం హైదరాబాదులో అందుకున్న సందర్భంగా విశాఖపట్నంలో ఉన్న పలు స్వచ్ఛంద సంస్థలు ఆయనను ఘన స్వాగతం పలికారు దీన్ని పురస్కరించుకొని పత్రికా సోదరులతో మాట్లాడుతూ ఈ యొక్క పురస్కారం నాకు రావడం చాలా సంతోషంగా ఉంది అలాగే ఇటువంటి పురస్కారాలు మా వంటి స్వచ్ఛంద సంస్థలకు అందించడం మాపై మరింత బాధ్యతని పెంచుతున్నారు నాకు వచ్చిన ఈ పురస్కారం నా ఒక్కడిది కాదు సేవ చేస్తున్న ప్రతి ఒక్కరిది ఈ యొక్క పురస్కారాన్ని ప్రతి ఒక్క సేవకునికి అంకితం చేస్తున్నానని అలాగే ముందు ముందు మా స్వచ్ఛంద సంస్థ నుంచి మరిన్ని సేవలు చేస్తామని నాకు ఇంతటి ఘన స్వాగతం పలికిన నాతోటి స్వచ్ఛంద సంస్థ అందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను

## కరెంటు కోతలపై నిరసన కార్యక్రమం చేపట్టిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ మే 23 ప్రజా పాలన ప్రతినిధి అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ చందాపురం గ్రామంలోని సబ్ స్టేషన్ ముందు మాజీ ఎమ్మెల్యే తంగిరాలసౌమ్య ఇతర తెదేపా నాయకులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసలే ఎండాకాలం ఈ కాలంలో కరెంటు లేకపోతే ప్రజలు వి లువలలాడే పరిస్థితులు ఆ ప్రకటిందంగా విద్యుత్ కో తలు విధిస్తున్నారని ప్రజలను ఇబ్బందులకు పాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు కరెంటు కోతలు ఆ గాలంటే.జగన్ రెడ్డి దిగిపోవాలన్నారుగత తెలుగు దే శం హయాంలో లోటు బడ్జెట్ లో కూడా 10000 మె గా వాట్లు అదనంగా విద్యుత్తు ఉత్పత్తి చేశారన్నారు వెంటనే అధికారులు,అధికార పార్టీ నాయకులు వి ద్యుత్ కోతలను అరికట్టి పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## మరోసారి విజయ్ వర్సెస్ ఎస్ జె సూర్య?



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు అట్లీ తో చేరిన చిత్రాలు మంచి హిట్స్ కాగా ఈ చిత్రాల్లో సెన్సేషనల్ హిట్ చిత్రం "మెర్సల్" కూడా ఒకటి. మరి ఈ చిత్రంలో వెర్సటైల్ నటుడు ఎస్ జె సూర్య ని ఓ క్రేజీ విలన్ గా అయితే అట్లీ చూపించాడు. అంతే కాకుండా విజయ్ మరియు ఎస్ జె సూర్య మధ్య ఎలాంటి సీన్స్ కూడా ఉన్నాయో తెలిసిందే. ఇక ఈ క్రేజీ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానున్నట్టుగా తెలుస్తుంది. అయితే ఈసారి దర్శకుడు వెంకట్ ప్రభు చిత్రంలో మరోసారి విజయ్ వర్సెస్ సూర్య కాంబో ని చూడబోతున్నట్టుగా తెలుస్తుంది. ప్రస్తుతానికి అయితే ఈ కాంబినేషన్ పై చర్చలు నడుస్తుండగా ఎస్ జె సూర్య ఇంకా ఫైనల్ కావాల్సి ఉంది. ఇక దీనికి ముందే ఎస్ జె సూర్య అయితే విజయ్ "వారిసు" లో కూడా ఓ కీలక పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే.

## తెలుగు సినిమాలపై కన్నేసిన జియో సినిమా..!

బాహుబలి తర్వాత తెలుగు సినిమా రేంజ్ మారిపోయింది. అప్పటి వరకు తెలుగు సినిమా కాస్త చులకనగా చూసేవారు కూడా ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ఆర్ఆర్ఆర్ కి ఆస్కార్ వచ్చిన తర్వాత తెలుగు సినిమా క్రేజ్ మరింత పెరిగిందనే చెప్పాలి. తెలుగులో నటించాలని ఇతర ఇండస్ట్రీల వాళ్లు తహతహలాడుతున్నారు. మరోవైపు తమ సినిమాల్లో తెలుగు హీరోలను తీసుకుంటే తమ మూవీకి కూడా క్రేజ్ వస్తుందని వారు భావిస్తున్నారు. మరో వైపు ఓటీటీ సంస్థలు సైతం తమ కళ్లన్నీ తెలుగు సినిమాలపై పెడుతుండటం విశేషం. ఓటీటీల్లో తెలుగు సినిమాలు రావడం సహజమే. కానీ ఎక్కువగా అమేజాన్ ప్రైమ్ హాట్ స్టార్ వంటి వాటిల్లోనే వచ్చేవి. నెట్ ఫ్లిక్స్ లో కూడా చాలా తక్కువ సినిమాలు వచ్చేవి. ఇక జియో సినిమా సంగతి అయితే చెప్పనక్కర్లేదు. ఎక్కువ సినిమాలు అన్నీ హిందీ ఇంగ్లీష్ వే ఉంటాయి. తెలుగు చాలా అరుదుగా ఉంటాయి. అయితే ఈ విషయంలో జియో సినిమా తాజాగా ఓ నిర్ణయం తీసుకుందట. తెలుగు సినిమాకి పెరుగుతున్న మార్కెట్ ని దృష్టిలో పెట్టుకొని జియో సినిమా పెద్ద ప్లాన్ వర్కౌట్ చేస్తున్నట్లు సమాచారం. తమ జియో సినిమాలో ఎక్కువ తెలుగు సినిమాలు ఉండేలా ప్లాన్ చేయాలని అనుకుంటోందట. ఇక నుంచి విడుదలయ్యే సినిమాల్లో ఎక్కువ శాతం సినిమాలను జియో సినిమా కొనుగోలు చేయాలని ప్లాన్ వేస్తోందట. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న చాలా సినిమాలను కొనుగోలు చేయడానికి జియో సినిమా ప్లానింగ్ మొదలుపెట్టినట్టు సమాచారం. ఏది ఏమైనా ఇలాంటి వార్తలు వింటున్నప్పుడు చాలా ఆనందం వేస్తుంది. మన తెలుగు సినిమా స్థాయి రోజు రోజుకీ పెరుగుతుండటం నిజంగా మనకు గర్వ కారణమే. మరి జియో సినిమా ఎలాంటి సినిమాలను కొనుగోలు చేస్తుందో చూడాలి. ఇదిలా ఉంటే జియో సినిమా మొన్నటి వరకు ఉచితంగా ఉండేది. ఇప్పుడు దానికి కూడా ఛార్జీలు కేటాయించారు. జియో సినిమా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర రూ. 999 గా ఉంది. ఏడాది వ్యాలిడిటీ ఉంటుంది. జియో సినిమా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ రీచార్జ్ చేసుకోవాలి అనుకునే వారు యూపీఐ డెబిట్ కార్డు క్రెడిట్ కార్డుతో చెల్లింపులు చేసి రీచార్జ్ చేసుకోవచ్చు.




## బ్రో' నుండి సాయి తేజ్ ఫస్ట్ లుక్ రిలీజ్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, సాయి తేజ్ ప్రధాన పాత్రల్లో సముద్రఖని దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లింగ్ కాన్సెప్ట్ మూవీ బ్రో. థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీలో ప్రియా ప్రకాష్ వారియర్, కేతిక శర్మ, తనికెళ్ల భరణి, రాజా చెంబోలు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు చేస్తుండగా దీనిని గ్రాండ్ లెవెల్లో జీ స్టూడియోస్, పీపుల్స్ మీడియా ఫాక్టరీ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రారంభం నాటి నుండి అందరిలో మంచి అంచనాలు ఏర్పరిచిన బ్రో మూవీ, ఇటీవల తమిళ్ లో రిలీజ్ అయి మంచి విజయం సొంతం చేసుకున్న వినోదయ సిత్తం కి రీమేక్ గా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ మూవీ నుండి రిలీజ్ అయిన పవన్ కళ్యాణ్ ఫస్ట్ లుక్ పోస్టర్ కి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభించగా నేడు సాయి తేజ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని కొద్దిసేపటి క్రితం విడుదల చేసారు. మార్కండేయులు (మార్క్) పాత్రలో వైట్ అండ్ వైట్ కాస్ట్యూమ్స్ తో అదిరిపోయే లుక్ లో సాయిధరమ్ తేజ్ ని ఈ పోస్టర్ లో చూడవచ్చు. ప్రస్తుతం ఈ పోస్టర్ కి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. మొత్తంగా ఈ సినిమాని అన్ని కార్యక్రమాలు ముగించి జులై 28న విడుదల చేయనున్నారు మేకర్స్.

## తేజ వారసుడు ఎంట్రీ.. ఆసక్తికరమైన విషయాలివే..!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక్కో డైరెక్టర్ కి ఒక్కో స్టైల్ ఉంటుంది. ఈ క్రమంలో ఎంతమంది డైరెక్టర్స్ ఉన్నా సరే ప్రేమకథల స్పెషలిస్ట్ అంటే అందరు చెప్పేది ఒక్కరి పేరే అతనే డైరెక్టర్ తేజ. తేజ సినిమా అంటే అది లవ్ స్టోరీనే పక్కా అని ఫిక్స్ అయ్యేలా ప్రతి ప్రేమకథతో ప్రేక్షకుల మనసులు గెలిచారు తేజ. అంతేకాదు తేజ సినిమా అంటే కొత్త హీరో కొత్త హీరోయిన్ ఇలా అందరు కొత్త వాళ్లతోనే సినిమా ఉంటుందని తెలిసిందే. ప్రస్తుతం దగ్గుబాటి వారసుడు అభిరాం హీరోగా అహింస సినిమా సినిమాతో రాబోతున్నాడు తేజ. ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అన్నది ప్రస్తుతానికి క్లారిటీ రాలేదు. అయితే రీసెంట్



ఇంటర్వ్యూలో తన వారసుడు హీరోగా ఎంట్రీ ఇచ్చే విషయాన్ని వెల్లడించారు తేజ. తేజ కొడుకు సినిమాలపై ఆసక్తిగా ఉన్నాడట. అందుకే తనయుడి ఎంట్రీపై ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నారు తేజ. తన కొడుకుని హీరోగా పరిచయం చేయాలని అనుకుంటున్నా.. తనకు కూడా ఇంట్రెస్ట్ ఉందని.. అందుకే విదేశాల్లో అందుకు సంబంధించిన కోర్సులు చేస్తున్నాడని అన్నారు. తను చూడటానికి అందంగా ఉంటాడు. అయితే హీరోగా చేయడానికి అదొక్కటే సరిపోదు కదా అని అన్నారు తేజ. ఇక తనయుడిని తాను డైరెక్ట్ చేస్తానా లేక మరొవరికైనా అప్పగించాలా అన్నది ఇంకా నిర్ణయించలేదని అన్నారు తేజ. అహింస సినిమా రిలీజ్ ఎప్పుడన్నది ఇంకా ఫైనల్ అవలేదు. అసలైతే ఏప్రిల్ లో రిలీజ్ అవ్వాల్సి ఉన్న ఈ సినిమా రిలీజ్ విషయంలో దర్శక నిర్మాతలు ఎందుకు లేట్ చేస్తున్నారన్నది అర్థం కావట్లేదు. అహింస తో తేజ మరోసారి తన డైరెక్షన్ టాలెంట్ చూపించాలని చూస్తున్నారు. ఈ సినిమా తర్వాత గోపీచంద్ తో ఒక సినిమా ప్లానింగ్ లో ఉంది. ఆ సినిమా గురించి డీటెయిల్స్ కూడా త్వరలో తెలుస్తాయి.

## "ది కేరళ స్టోరీ" 200 నాటౌట్!




ది కేరళ స్టోరీ చిత్రం చిన్న సినిమా గా థియేటర్ల లో విడుదల అయ్యి, సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. కంటెంట్ బాగుంటే, ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తారు అని మరోసారి ది కేరళ స్టోరీ చిత్రం తో రుజువైంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ గా స్ట్రాంగ్ గా కొనసాగుతోంది. ఈ చిత్రం సోమవారం రోజు మరో 4.50 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. దీంతో ఈ సినిమా ఇప్పటి వరకూ 203.4 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 200 కోట్ల రూపాయల క్లబ్ లో చేరడం తో చిత్ర యూనిట్ సంతోషం లో ఉంది. లాంగ్ రన్ లో ఈ చిత్రం మరింత వసూళ్ళను రాబట్టే అవకాశం ఉంది. వీక్ డేస్ కావడం తో కలెక్షన్స్ కాస్త డ్రాప్ అయిన, ఆదరణ మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. సుదిప్తో సేన్ దర్శకత్వం లో తెరకెక్కిన ఈ చిత్రం లో అదా శర్మ, సిద్ది ఇద్నానీ లు కీలక పాత్రల్లో నటించారు.

## హాలీవుడ్ దర్శకులకే చరణ్ కండీషన్లు!



ఆర్ ఆర్ ఆర్ విజయంతో రామ్ చరణ్ రేంజ్ హాలీవుడ్ ని తాకింది. ఆస్కార్ అవార్డు గుర్తింపుతో ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయ్యారు. ఒక్క హిట్ తో గ్లోబల్ స్టార్ అయ్యారు. ప్రియాంక చోప్రా తర్వాత ఇండియా నుంచి గ్లోబల్ గుర్తింపు చరణ్ కి మాత్రమే దక్కింది. తాజాగా చరణ్ కశ్మీర్ లో జరుగుతోన్న జీ-20 సదస్సుకు ఇండియన్ స్టార్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో ఎన్నో విషయాలు పంచుకున్నారు. అవేంటో ఆయన మాటల్లోనే..ఇండియాలో ఎన్నో అందమైన లొకేషన్లు ఉన్నాయి. కశ్మీర్ లో ఈ సదస్సు పెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. కేరళ..కశ్మీర్ లాంటి ఎన్నో ప్రాంతాల్లో ప్రకృతి ఎంతో బాగుంటుంది. షూటింగ్ లకు ఎంతో అనుకూలంగా ప్రదేశాలివన్ని. నా సినిమాల ద్వారా వీటిని ప్రపంచానికి చూపించాలనుకుంటున్నా. అందుకే నేను నటించే సినిమాలు ఎక్కువగా ఇండియాలోనే షూటింగ్ జరగాలని కోరుకుంటున్నా. ఇకపై కేవలం లొకేషన్లు కోసం ఇతర దేశాలకు వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్నా. నేను హాలీవుడ్ సినిమాల్లో నటించినా అక్కడ దర్శకులకు ఇండియా అందాలు చూపిస్తాను. ఇక్కడ కూడా షూటింగ్ చేయాలని కండీషన్ పెడతాను. నార్త్..సౌత్ అని రెండు రకాల సినిమాలు లేవు. ఉన్నది ఒక్కటే సినిమా అది. భారతీయ సినిమా. ఇప్పుడు మన సినిమా గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆర్ ఆర్ ఆర్ సినిమాతో జపాన్ ఆడియన్స్ కు ఎంతో దగ్గరయ్యాం. అక్కడి ప్రజలు ఎంతో ఆత్మీయంగా ఉంటారు. జపాన్ అంటే ఉపాసనకి ఎంతో ఇష్టం. ఇప్పుడామె ఏడు నెలల గర్భిణి. ఇప్పుడు జపాన్ వెళ్దామన్నా! రెడీ అంటుంది. చిన్నప్పుడు నాన్న గారితో కలిసి సినిమా షూటింగ్ కోసం కశ్మీర్ వెళ్లాను. అప్పటి నుంచి ఎన్నో సార్లు ఇక్కడికి వచ్చాను. నాన్న గారికి ఇప్పుడు 68 ఏళ్లు. ఇప్పటికీ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. అంత పెద్ద హీరో అయినా ఇప్పటికీ ఉదయం 5.30 గంటలకు నిద్ద లేస్తారు. ఆయనకి సినిమాలపై అంతటి నిబద్ధత ఉంటుంది. ఆయన్ని చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయనే నాకు స్ఫూర్తి- అని అన్నారు.


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

రూపాయి పెట్టుబడి లేకుండా...
భాగస్వాములు అవ్వండి...

భారతదేశంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా, కొన్ని వర్గాలు,కొన్ని పార్టీల చేతిలో కీలుబొమ్మగా ఉన్న విషయం విధితమే. దీని వలన, 3 ఎస్టేట్స్ అయినటువంటి పార్లమెంట్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషరీ వ్యవస్థలోని తప్పిదాలను ప్రపంచానికి తెలియపరచలేకపోతుంది. మరీ ముఖ్యంగా ఈ దేశం బాగుండాలని కోరుకునే OC లలోని అభ్యుదయ వాదులు , బీసీ, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం,మైనార్టీలు వారి సమస్యలు ప్రభుత్వాలకు తెలియకపోవడం వలన దేశాభివృద్ధిలో బహుజనులు పాలు పంచుకోలేక పోతున్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చెప్పిన విధంగా
"పక్షికి రెక్కలు లేకపోతే ఎగురలేదు,
బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు"

అని చెప్పిన దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ,ప్రజాపాలన తెలుగు దినపత్రిక ను మండలాల వారీగా పెట్టుబడి లేకుండా 60 % - 40% నిష్పత్తిలో పాట్నర్ షిప్ ఇస్తుంది. మీ మీ ప్రాంతం లో 100 లేదా 50 పేపర్లు చొప్పున తీసుకొని పార్ట్నర్‌గా చేరి మీ ప్రాంతంలో పత్రికాధిపతిగా ఆదాయంతో పాటు ఎనలేని గౌరవాన్ని పొందండి.

వివరాలకు ఈ క్రింది నంబర్లలో సంప్రదించండి.
8886022523,9000621111,9948725373


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com